ప్రేమతో మాట్లాడు
ఆలోచించి మాట్లాడు
అర్థం చేసుకొని మాట్లాడు
మంచి మాట్లాడు
తెలివిగా మాట్లాడు
నవ్వుతూ మాట్లాడు
మనస్సు విప్పి మాట్లాడు
పూర్తిగా విన్న తరువాత మాట్లాడు
మనస్సు నొప్పించకుండా మాట్లాడు
తక్కువ మాట్లాడు



TGTEL/25/A1132

మానవాళికి

# జనంవార్త

ప్రతి అక్షరం.. జనం కోసం..

Q6 NEWS తెలుగు

మేడ్చల్ | శుక్రవారం | 24.07.2026 | సంపుటి : 2 | సంచిక : 22 | పేజీలు : 8 | వెల : 2/- | ఎడిటర్ : గడ్డమీది నాగరాజు




**నేటి చికెన్ ధరలు**

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 140 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 167 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 259 (కిలో) |
| స్కిన్ లెస్ | 292 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹98

## గ్లోబరినాతో మీరెందుకు ఒప్పందం చేసుకున్నారు?

**పగలు కాంగ్రెస్, రాత్రి బిజెపితో రేవంత్ సావాసం**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు**



**వరంగల్, జూలై 23 :** గ్లోబరీనా తన బినామీ సంస్థ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణలపై ఇప్పటికే పరువు నష్టం నోటీసులు పంపానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. గురువారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన ముఖ్యమంత్రి.. ఒక్కసారి కూడా ప్రధాని నరేంద్ర మోదీ పేరును

-మిగతా 2 లో..



### తెలంగాణ శాసనసభకు ఆధునిక హంగులు

- ఆధునీకరణ పనులు పరిశీలించిన సిఎం రేవంత్
- నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలని ఆదేశం

03

## యువత గొంతు నొక్కితే పతనం తప్పదు

**బిజెపికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హెచ్చరిక**

యువత గొంతు నొక్కితే బీజేపీ రాజకీయ పతనం తప్పదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యాన్ని భయపెట్టలేరని.. రాజ్యాంగాన్ని అణచలేర న్నారు. విద్యార్థుల ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా నిర్బంధాలు సరికాదని అన్నారు. ఉద్యోగాలు అడిగిన యువతకు లాఠీలు, కేసులే బీజేపీ సమాధానమన మంటూ విమర్శ లు గుప్పించారు.



02

## పేపర్ లీక్ కేసుల విచారణ కోసం ఫాస్ట్-ట్రాక్ కోర్టు

**ఎక్స్ వేదికగా స్పందించిన ప్రధాని మోడీ**



న్యూఢిల్లీ, జూలై 23 : నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన భారీ నిరసనల నేపథ్యంలో ప్రధాని మోదీ ఎట్టకేలకు స్పందించారు. పేపర్ లీక్ కేసుల విచారణ కోసం ఫాస్ట్-ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని ప్రధాన మంత్రి ఎక్స్ వేదికగా తెలిపారు. పేపర్ లీక్ ఘటనల్లో ప్రమేయం ఉన్నవారికి త్వరితగతిన కఠిన శిక్షలు పడేలా చూసేందుకు ఫాస్ట్-ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని నిర్ణయించామని పేర్కొన్నారు. ఈ విషయంలో అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. విద్యార్థుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు తాము కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు. అలాగే మన యువత భవిష్యత్తుకు హాని కలిగించే

-మిగతా 2 లో..

# పార్లమెంటులో ప్రతిష్టంభన

## నీట్ లీకేజీపై చర్చపై కుదరని ఏకాభిప్రాయం

**ధర్మేంద్ర రాజీనామా చేయాల్సిందేనని పట్టు**

**విపక్షాల పట్టుతో పార్లమెంట్ నేటికి వాయిదా**

**పార్లమెంట్ వెలుపల పరస్పర నినాదాలు**



పార్లమెంటులో ప్రతిష్టంభన కొనసాగుతోంది. గురువారం ప్రారంభమైన రెండు నిముషాలకే ఉభయసభలు తొలుత 12గంటలకు వాయిదా పడ్డాయి. అనంతరం సమావేశమైనా సభలు సాగలేదు. ధర్మేంద్ర ప్రదాన్ రాజీనామా చేస్తేనే చర్చకు అంగీకరిస్తామని రాజ్యసభలో మల్లికార్జున ఖర్గే తెగేసి చెప్పారు.

న్యూఢిల్లీ, జూలై 23 : నీట్ పేపర్ లీక్ అంశంపై ప్రతిపక్షాల నిరసనల నడుమ లోక్‌సభ నేటికి వాయిదా పడింది. రాజ్యసభను కూడా మధ్యాహ్నం మూడు గంటల వరకూ వాయిదా పడింది. నీట్ పేపర్ లీక్ ఉదంతానికి ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలని లోక్‌సభ ప్రారంభం కాగానే ప్రతిపక్షాలు డిమాండ్ చేయడం ప్రారంభించాయి. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందేనని పట్టుబట్టాయి. ఈ క్రమంలో సభ పలు మార్లు వాయిదా పడింది. పేపర్ లీక్ జరిగినట్లు ప్రభుత్వం అంగీకరిస్తే వెంటనే విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్ డిమాండ్ చేశారు. రూల్ 267 కింద చర్చ చేపట్టాలని కోరుతుంటే ప్రభుత్వం అంగీకరించట్లేదని కాంగ్రెస్ పార్టీ

-మిగతా 2 లో..



## గ్లోబరీనా కేటీఆర్ బినామీ సంస్థ

**గ్లోబరీనా తప్పిదాల వల్ల 27 మంది బలి**

**పేరు మార్చుకుని కాంట్రాక్ట్ పొందింది**

**బిఆర్ఎస్, బిజెపిలు రెండూ ఒక్కటే**

**ధర్మేంద్ర రాజీనామాను బిఆర్ఎస్ ఎందుకు డిమాండ్ చేయదు**

**సర్ ప్రక్రియలో ఎస్సీఎస్టీ, ఓట్లు తొలగించే కుట్ర**

**అందుకే అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నాం**

**మీడియాతో చిట్‌చాట్‌లో సిఎం రేవంత్ రెడ్డి**

గ్లోబరీనా ముమ్మాటికీ కేటీఆర్ బినామీ సంస్థ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోమారు ఆరోపించారు. గురువారం మీడియాతో నిర్వహించి చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. గ్లోబరీనా తప్పిదాల వల్ల 27 మంది చనిపోయారని.. ఆ సంస్థ పేరు మార్చుకొని పరీక్షల కాంట్రాక్టు పొందిందని వ్యాఖ్యానించారు. వీటి ఆధారంగానే నీట్ కుంభకోణం జరిగిందన్నారు.

హైదరాబాద్, జులై 23 : గ్లోబరీనా తప్పిదాలపై కేటీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అమరవీరుల స్తూపం వద్ద కేటీఆర్ ముక్కు నేలకు రాయాలన్నారు. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ విషయంలో బీఆర్ఎస్ ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేత కేటీఆర్,

-మిగతా 2 లో..

## నేడు దేశవ్యాప్త ఆందోళనలు

**కాక్రోచ్ జనతా పార్టీ పిలుపు**

**శాంతియుతంగా నిరసనలు తెలపాలని సూచన**

న్యూఢిల్లీ, జూలై 23 : నీట్ పేపర్ లీక్‌కు కేంద్రం బాధ్యత వహించాలంటూ ఉద్యమిస్తున్న కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) 24న శుక్రవారం దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చింది. ఇటీవలి జంతర్ మంతర్-పార్లమెంటు ర్యాలీ సందర్భంగా యువతపై పోలీసుల కర్కశత్వాన్ని వ్యతిరేకిస్తూ ఈ నిరసనకు పిలుపునిచ్చినట్టు తెలిపింది. ఈ కార్యక్రమానికి కావాల్సిన అనుమతులు, ఇతర ఏర్పాట్లకు సిద్ధం కావాలని యువతను కోరింది. శాంతియుతంగానే నిరసనలు ఉండాలని కూడా సూచించింది. పేపర్ లీక్ అంశంపై చర్చకు తాము సిద్ధమని కేంద్రం ప్రకటించిన నేపథ్యంలో కాక్రోచ్ జనతా పార్టీ మరో నిరసన కార్యక్రమానికి సిద్ధం కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ నిరసన

-మిగతా 2లో..



**ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించండి**

**లేకుంటే మీరే తొలగి పోవాల్సి వస్తుంది**

**ప్రధాని మోడీకి అభిజిత్ దీప్కే హెచ్చరిక**

02




## కాంగ్రెస్, కమ్యూనిస్టుల జంతర్ మంతర్ రాజకీయాలు

**గతంలో లీక్ అయితే కాంగ్రెస్ నేతలు రాజీనామా చేశారా**

**టెన్త్ లీకేజీలో రేవంత్ రెడ్డి ఎందుకు రాజీనామా చేయలేదు**

**కేంద్రమంత్రి మంత్రి కిషన్ రెడ్డి మండిపాటు**

జంతర్ మంతర్‌లో జరుగుతున్న విద్యార్థుల ఆందోళనలు పట్టుకుని కాంగ్రెస్, కమ్యూనిస్ట్ పార్టీల నేతలు రాజకీయాలు చేస్తున్నారని కేంద్ర బొగ్గు శాఖ మంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నుకున్న ప్రభుత్వాలను కూల్చాలని చూస్తున్నారంటూ ప్రతిపక్ష పార్టీలపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

న్యూఢిల్లీ, జూలై 23 : గతంలో పేపర్లు లీక్ అయినప్పుడు కాంగ్రెస్‌లోని నేతలు ఏ రోజైన రాజీనామా చేశారా? అని ఆ పార్టీ నేతలను నిలదీశారు. యూపీఏ హయాంలో ప్రశ్న పత్రాలు లీక్ అయ్యాయనే విషయాన్ని గుర్తు ఉంచుకోవాలని ఆ పార్టీ నేతలకు కేంద్ర మంత్రి ఈ సందర్భంగా సూచించారు. దేశ రాజధాని న్యూఢిల్లీలోని జంతర్ మంతర్‌తో పాటు రాష్ట్రాల్లో జరుగుతున్న సంఘటనలు దురదృష్టకరమని

-మిగతా 2 లో..

## మహానగరం నడిబొడ్డున పేదోడికి ఇల్లు ఉండొద్దా?

**పేదలకు ఇళ్లు కడితే... ఎందుకంత కడుపుమంట?**

**పదేళ్లు చేయలేనిది కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుంటే... విష ప్రచారమా?**

**కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూముల్లో పేదలకు వాటా ఇస్తే తప్పా?**

**రూ. 60 లక్షల విలువైన ఇంటిని ఆరు లక్షలకే ఇస్తుంటే కడుపుమంట**

**డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పేరుతో పేదలను దగా చేసింది బిఆర్ఎస్**

**ఇండ్ల కేటాయింపులో బడుగు బలహీన వర్గాలకు 50 శాతం రిజర్వేషన్లు**

**బీఆర్ఎస్ తీరుపై మండిపడ్డ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**



హైదరాబాద్,జూలై 23 : హైదరాబాద్ మహానగరం నడిబొడ్డులో పేదలకు గౌరవ ప్రదమైన సొంతింటిని అందించాలనే ప్రజా ప్రభుత్వ సంకల్పాన్ని చూసి బీఆర్ఎస్ నాయకత్వం తీవ్ర అసహనానికి గురవుతోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార,పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. నిరుపేదలు నివసిస్తున్న ప్రాంతంలోనే వారి సొంతింటి కలను నెరవేర్చడానికి నియోజకవర్గాన్ని యూనిట్ గా తీసుకొని వారు నివసిస్తున్న ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తున్నామని అన్నారు. ఈ ఇళ్ల కోసం స్థానికంగా అందుబాటులో ఉన్న మీ సేవ కేంద్రాలలో దరఖాస్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేసారు. అదేవిధంగా మీసేవ వాట్సాప్ నెంబర్ (8096958096), వెబ్‌సైట్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. గురువారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో

-మిగతా 2 లో..

## పేపర్ లీక్ కేసుల విచారణ కోసం
# ఫాస్ట్-ట్రాక్ కోర్టు

(మొదటిపేజీ తరువాయి)

వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదు అని ఆయన స్పష్టం చేశారు. విద్యార్థుల ప్రయోజనాలను కాపాడటమే తమ తొలి ప్రాధాన్యమని పేర్కొన్నారు. 'మన యువత సంక్షేమం, వారి భవిష్యత్తు కంటే.. ఏదీ ముఖ్యం కాదు! పేపర్ లీకేజీల్లో ప్రమేయం ఉన్నవారికి త్వరితగతిన కఠిన శిక్షలు పడేలా ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. దీనికి సంబంధించి అవసరమైన అన్ని చర్యలు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించాను. విద్యార్థుల ప్రయోజనాలను కాపాడేందుకు మేము తీసుకుంటున్న వరుస చర్యల్లో ఇది భాగం. యువత భవిష్యత్తును దెబ్బతీసేందుకు ప్రయత్నించే వారిని వదిలిపెట్టేది లేదు' అని ప్రధాని చెప్పారు.

# నేడు దేశవ్యాప్త ఆందోళనలు

(మొదటిపేజీ తరువాయి)

కార్యక్రమానికి కావాల్సిన అనుమతులు పొందేందుకు, ఏర్పాట్లు చేసేందుకు విద్యార్థి సంఘాలు, యూత్ ఆర్గనైజేషన్లు కలిసి పనిచేయాలని సీజేపీ పిలుపునిచ్చింది. నీట్ పేపర్ లీక్ అంశంలో సీజేపీ డిమాండ్స్ గురించి ఈ నిరసనల్లో బహిరంగంగా చదవాలని పేర్కొంది. బాధితులకు సంఘీభావంగా ఇంక్విలాబ్ జిందాబాద్, భారత్ మాతాకీ జై వంటి నినాదాలు చేయాలని కూడా సూచించింది. నిరసనల్లో కేవలం సానుకూల నినాదాలను మాత్రమే చేయాలని చెప్పింది. ఎలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయొద్దని పేర్కొంది. నిరసనకు అనుమతి ఉన్న ప్రాంతాలకే పరిమితం కావాలని, ట్రాఫిక్‌కు ఆటంకాలు లేకుండా చూసుకోవాలని సూచించింది. రెచ్చగొట్టే చర్యలకు స్పందించవద్దని కూడా పేర్కొంది. ఇక నీట్ ఉదంతంపై విచారణ కోసం కేంద్రం ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసేందుకు సిద్ధమైన విషయం తెలిసిందే. ఇదిలావుంటే సీజేపీ ఆందోళనల నేపథ్యంలో న్యూఢిల్లీ ట్రేడర్స్ అసోసియేషన్ (ఎన్‌డీటీఏ) కీలక నిర్ణయం తీసుకుంది. ఆందోళనల తీవ్రత అధికంగా ఉన్న కన్నాట్ ప్లేస్ ప్రాంతంలో గురువారం సాయంత్రం 6:30కే దుకాణాలు, కార్యాలయాలు మూసివేయాలని ఆదేశాలు జారీ చేసింది. అందుకు యజమానులు సహకరించాలని కోరింది. ఎన్‌డీటీఏ ఆదేశాలను ఆమ్‌ఆద్మీపార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ఎక్స్‌లో పోస్టు చేశారు. సాయంత్రం 6:30 గంటలకే దుకాణాలు మూసేయమనడం, జంతర్‌మంతర్ వద్ద పోలీసులను మోహరించడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులపై కేంద్రం మరోసారి బలప్రయోగం చేయాలని చూస్తోందని ఆరోపించారు.

# ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించండి

**లేకుంటే మీరే తొలగి పోవాల్సి వస్తుంది**

**ప్రధాని మోడీకి అభిజిత్ దీప్కే హెచ్చరిక**

**న్యూఢిల్లీ, జూలై 23 :** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించాలని ప్రధాని మోదీని కాక్రోచ్ జనతా పార్టీ ప్రెసిడెంట్ అభిజీత్ దీప్కే గురువారం మరోసారి కోరారు. కేంద్రం స్పందించని పక్షంలో ఈ రాజీనామాల పర్వం ప్రధాని మోదీ వరకూ చేరుతుందని వ్యాఖ్యానించారు. 'మోదీ జీ.. మిమ్మల్ని మరోసారి అభ్యర్థిస్తున్నా.. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను ఆమోదించండి. లేకపోతే ఇది ఆయన రాజీనామాకే పరిమితం కాదు. మీ రాజీనామా వరకూ వస్తుంది' అని అన్నారు. ధర్మేంద్ర ప్రధాన్‌కు కేంద్రం ఇంకా ఎందుకు అండగా ఉంటోందని అభిజీత్ దీప్కే ప్రశ్నించారు. 'దేశంలోని కోట్ల మంది విద్యార్థుల కంటే ఒక విఫల, అసమర్థ మంత్రి ఎక్కువ కాదు కదా? ఒక వేళ మంత్రే ముఖ్యమని భావిస్తే దేశంలో మీకెవరూ ఓటు వేయబోరన్న విషయాన్ని మర్చిపోవద్దు' అని అన్నారు. నీట్ పేపర్ లీక్‌పై చర్చకు కేంద్రం మరోసారి ఆహ్వానించగా సీజేపీ తిరస్కరించిన విషయం తెలిసిందే. ఎలాంటి చర్చైనా జంతర్‌మంతర్ వద్ద లేదా మరో తటస్థ వేదికపై జరగాలని సీజేపీ స్పష్టం చేసింది. ఇక ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేస్తామన్న ప్రధాని ప్రకటనపై కూడా సీజేపీ ప్రతినిధి స్పందించారు. ఇలాంటి ప్రకటనలతో ఏ ప్రయోజనం ఉండదని అన్నారు. మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా మినహా తాము మరొకటి ఆశించట్లేదని స్పష్టం చేశారు.



# పార్లమెంటులో ప్రతిష్టంభన

(మొదటిపేజీ తరువాయి)

జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అన్నారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీని కేంద్రం అవమానించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తరువాతే తాము ఏ చర్చకైనా సిద్ధమని స్పష్టం చేశారు. ప్రతిపక్షాల తీరుపై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మండిపడ్డారు. నీట్‌పై చర్చ నుంచి తప్పించుకోవాలని ప్రతిపక్షాలు చూస్తున్నాయని ఆరోపించారు. చర్చ ముందు షరతులు పెట్టడం భావ్యం కాదని అన్నారు. ఈ అంశంపై తన వాదన వినిపించే హక్కు ప్రభుత్వానికి కూడా ఉంటుందని అన్నారు. ఇదిలావుంటే పార్లమెంట్ వెలుపల విపక్షాలు, బిజెపిలు పరస్పర ఆందోళనలకు దిగారు. నిరసలనతో హోరెత్తించారు. కాంగ్రెస్ ఇండియా కూటమి ఒకవైపు, ఎన్‌డిఏ నేతలు మరో వైపు నిలబడి నినాదాలు చేశారు.

# కాంగ్రెస్, కమ్యూనిస్టుల జంతర్ మంతర్ రాజకీయాలు

(మొదటిపేజీ తరువాయి)

కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ సంఘటనలు రాజకీయ ప్రేరేపితమైనవని అభివర్ణించారు. గురువారం న్యూఢిల్లీలో ఆయన మాట్లాడుతూ.. గతంలో షాహిన్‌బాగ్‌లో ఆందోళనలు చేసిన నిరసనకారులు దీని వెనుక ఉన్నట్లు అనిపిస్తుందని అన్నారు. నీట్ పేపర్ లీక్ చేసిన వారిని అరెస్ట్ చేసి కేంద్ర ప్రభుత్వం జైలులో పెట్టిందని తెలిపారు. విద్యార్థులకు నష్టం జరగ వద్దని మరోసారి నీట్ పరీక్షను నిర్వహించామని వివరించారు. పేపర్ లీక్‌పై 2024 చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కేంద్రాన్ని ప్రశ్నించే హక్కు రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి ఉందా? అని బల్లగుద్దీ ప్రశ్నించారు. ఏ ముఖం పెట్టుకొని ప్రధాని ఇంటి ముందు ధర్నా చేస్తున్నారంటూ కాంగ్రెస్ పార్టీ నేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు. ఫాస్ట్ ట్రాక్ ద్వారా చట్టాన్ని మరింత కఠినం చేస్తామని ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పదో తరగతి పేపర్ లీక్ అయిందని అన్నారు. మరి ముఖ్యమంత్రి పదవికి రేవంత్ రెడ్డి రాజీనామా ఎందుకు చేయలేదని ఆ పార్టీ నేతలను ఆయన నిలదీశారు. చలో రాజ్ భవన్ కార్యక్రమం నిర్వహించే సత్తా మీకు ఎక్కడిదంటూ తెలంగాణలోని అధికార పార్టీ నేతల తీరును ఆయన ఎండగట్టారు. విద్యార్థులపై ప్రేమ లేదంటూ కాంగ్రెస్ పార్టీ నేతలపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి నిప్పులు చెరిగారు.

# గ్లోబరీనా కేటీఆర్ బినామీ సంస్థ

(మొదటిపేజీ తరువాయి)

బీజేపీపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కేటీఆర్ బర్త్ డే పై సీఎం రేవంత్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'కేటీఆర్ పుట్టిన రోజు దావత్ ఇస్తాడో అడగాలి. కేటీఆర్ ఇచ్చే దావత్ నేను తీసుకోలేనేమో. ఆయనవి అన్నీ వేరే పార్టీలు' అంటూ సెటైర్ విసిరారు. హరీశ్ గొప్పవాడైతే మంత్రి పదవి నుంచి ఎందుకు తీసేశారని ప్రశ్నించారు. అతి తెలివి తేటలతో ఏదిపడితే అది మాట్లాడతానంటే నడవదని హరీశ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ నేతలు కన్నెపల్లి పంపు హౌజ్ గురించి మాట్లాడుతున్నారని... మేడిగడ్డ గురించి ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. మేడిగడ్డ గురించి మాట్లాడితే ప్రజలు చెప్పుతో కొడతారని మండిపడ్డారు. మేడిగడ్డ కట్టింది, కూల్చింది బీఆర్‌ఎస్ వాళ్లే అని వ్యాఖ్యానించారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ అయిపోయే వరకూ ఎమ్మెల్యేలను గ్రామాల్లోనే ఉండమని చెప్పానని ముఖ్యమంత్రి అన్నారు. సర్ నాయకులకు సంబంధించింది కాదని, ప్రజలకు సంబంధించిందని స్పష్టం చేశారు. 'తెలిసీ తెలియక నాకు రెండు ఓట్లు ఉన్నాయని అంటున్నారు. కలెక్టర్ అనుమతి తీసుకొని నా గ్రామంలో ఉన్న ఓటును కొడంగల్‌కు మార్చుకున్నాను. గతంలో కొడంగల్ ప్రాంతం కర్ణాటకలోని జిల్లాలో ఉండేది. భాషా ప్రయుక్త రాష్ట్రాలు చేసినప్పుడు కొడంగల్ పాలమూరులోకి వచ్చిందని చెప్పారు. బీజేపీ కుట్రపూరితంగా ఓట్లను తొలగించే అవకాశముందని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. గ్రామీణ ప్రాంతంలో అమాయకుల ఓట్లు పోయే అవకాశముందన్నారు. సర్ ఉద్దేశం ప్రక్షాళన అని.. కుట్ర పూరితంగా సర్‌ను వాడుతున్నారని ఆరోపించారు. సర్ పట్ల జాగ్రత్తగా ఉండాల్సిందే అని చెప్పుకొచ్చారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ఓట్లు పోతే.. కాంగ్రెస్ ఓట్లు పోయినట్టే అని అన్నారు. అవగాహన లేకపోవడం, సరైన సమయంలో స్పందించకపోవడం వల్ల ఓట్లు పోయే అవకాశముందన్నారు. 'ఓటుహక్కు లేకపోతే పథకాలు పోతాయి.. ఓటుహక్కు లేకపోతే ఆధార్ పోతుంది. ఓటుహక్కు లేకపోతే గుర్తింపే ఉండదు... ఓటుహక్కు లేకపోతే సంక్షేమం రాదు' అని అన్నారు. బీజేపీలో అంతర్గత కలహాలు ఉన్నాయని రేవంత్ రెడ్డి అన్నారు. బీజేపీ నాయకులకు ఒకరంటే ఒకరికి పడదన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ఓట్లు ఎక్కడుంటాయో బీజేపీకి తెలుసని వెల్లడించారు. చిన్నచిన్న కారణాలతో ఓట్లు తొలగిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లకు 5 లక్షలు ఇవ్వాలని డిసైడ్ అయిందని చెప్పారు. బీఆర్‌ఎస్ నేతలు.. బ్రోకర్లకు అమ్ముకొని దళారీ వ్యవస్థ తెచ్చారని మండిపడ్డారు. 'మేం ఏం చేస్తున్నామో అదే చెప్తున్నాం' అని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 70 శాతం ఎస్ఐఆర్ పూర్తయిందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రక్షాళన పేరుతో ఓట్లు తొలగించే అవకాశం ఉందని.. అలా జరగకుండా ఉండేందుకు బీఎల్‌వోలను పెట్టామన్నారు. ఓట్లు లేకుంటే ప్రభుత్వ పథకాలు ఎలా వస్తాయని సీఎం ప్రశ్నించారు. గతంలో జీహెచ్‌ఎంసీ పరిధిలో ఉన్న ఆంధ్ర ఓట్లన్నీ తొలగించారు. కాంగ్రెస్ పార్టీ కోర్టుకు వెళితే.. జీహెచ్‌ఎంసీ కమిషనర్‌పై న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. హైడ్రా బాగా పనిచేస్తోంది.. చాలా ఆస్తులు స్వాధీనం చేసుకుంది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో నాణ్యతకు తిలోదకాలు ఇచ్చారు. ఆ ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతికి పాల్పడినందుకే హరీశ్‌రావుకు కొన్నాళ్లు మంత్రి పదవి ఇవ్వకుండా కేసీఆర్ పక్కన పెట్టారు. గత ప్రభుత్వంలో ఇంటర్ పేపర్ల మూల్యాంకనంలో జరిగిన తప్పిదాలతో 27 మంది విద్యార్థులు బలయ్యారు. గ్లోబరీనా సంస్థ విషయంలో కేటీఆర్ నిజాయతీ నిరూపించుకోవాలన్నారు. విద్యార్థుల మృతికి కారణమైన ఆయన క్షమాపణ చెప్పాలి. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు బీఆర్‌ఎస్ ఎందుకు డిమాండ్ చేయలేదని అన్నారు. పేదలకు ఇచ్చే ఇళ్లను బీఆర్‌ఎస్ నేతలు దళారులకు అమ్ముకున్నారు. జన్వాడ ఫాంహౌస్ భూములపై కేటీఆర్ విచారణ కోరాలి. మేం అధికారంలోకి వచ్చాకే ఇందిరాపార్కు వద్ద ధర్నా చౌక్‌ను తిరిగి ఓపెన్ చేశాం. నాడు వాళ్లు మూసిన ధర్నా చౌక్‌లోనే కేటీఆర్ ధర్నా చేస్తామంటున్నారని రేవంత్ వ్యాఖ్యానించారు.



## మహానగరం నడిబొడ్డున
# పేదోడికి ఇల్లు ఉండొద్దా?

(మొదటిపేజీ తరువాయి)

ఇందిరమ్మ ఇండ్లు, దరఖాస్తులు తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. సమీక్ష అనంతరం మంత్రి మాట్లాడుతూ పదేళ్ల పాలనలో వారు చేయలేని పనిని గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుంటే ప్రజలను తప్పుదోవ పట్టించేలా విష ప్రచారాలతో రాజకీయ లబ్దిపొందాలని బీఆర్ఎస్ ప్రయత్నిస్తోంది. పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం హైదరాబాద్‌లో పేదల సొంతింటి కలను నెరవేర్చలేక పోయింది. నగరంలోనే పుట్టి పెరిగి అక్కడే జీవిస్తున్న నిరుపేద కుటుంబాలకు నగర నడిబొడ్డులో సొంతింటిని సమకూర్చవలసిన బాధ్యతను విస్మరించి, వారిని నగరానికి దూరంగా నెట్టివేసింది. ఉద్యోగాలు, ఉపాధి, పిల్లల చదువులు, వైద్య సౌకర్యాలకు దూరంగా 30?40 కిలోమీటర్ల దూరంలో కనీస వసతులు కల్పించకుండా అరకొరగా ఇళ్లను నిర్మించి అదే పేదల సంక్షేమమని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. ప్రజా ప్రభుత్వం పేదోడు కూడా హైదరాబాద్ నడిబొడ్డులోనే గౌరవంగా జీవించాలనే భావనతో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ప్రభుత్వ భూములను ప్రజల సంక్షేమం కోసం వినియోగిస్తూ పేదలకు శాశ్వత భరోసా కల్పించే చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంటే దానిపైనా బీఆర్ఎస్ విషప్రచారం చేస్తోంది. పేదోడు హైదరాబాద్‌లో ఉండకూడదా? నగరంలో అత్యంత విలువైన ప్రభుత్వ భూములలో పేదలకు ఇళ్లు నిర్మించకూడదా? ప్రభుత్వ భూములు కొద్దిమంది కోసం మాత్రమేనా? పేదల కోసం వినియోగిస్తే ఎందుకింత కడుపుమంటని అన్నారు. పేదోడిపై తుపాకి పెట్టి రాజకీయాలు చేయాలనుకోవడం అత్యంత దుర్మార్గం. బీఆర్ఎస్ చేస్తున్న విష ప్రచారాలను, కపట నాటకాలను హైదరాబాద్ మహానగర ప్రజలు గమనించాలి, పేదల సంక్షేమాన్ని అడ్డుకునే రాజకీయాలను తిప్పికొట్టాలన్నారు. హైదరాబాద్‌లో సొంత ఇల్లు లేని మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి కుటుంబాలకు అందుబాటు ధరలో నాణ్యమైన గృహాలను అందించడమే లక్ష్యం. గతంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ఇందిరమ్మ టవర్స్ గా మార్చి విక్రయిస్తారన్న ప్రచారం పూర్తిగా అవాస్తవం. ప్రభుత్వం ప్రకటించిన మార్గదర్శకాల ప్రకారమే ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం జరుగుతుందన్నారు. లబ్దిదారుల మీద ఆర్థిక భారం తగ్గించడానికి ప్రభుత్వం రూ.5 లక్షల సబ్సిడీ ఇస్తోంది. ఇది అమ్మకం కాదు, ప్రభుత్వ ఆర్థిక సహకారం. లబ్దిదారుడి వాటా అన్ని ప్రాంతాల్లో రూ.6 లక్షలు మాత్రమే. ఎ÷-లాట్ల మార్కెట్ విలువ తొలి విడతలో ప్రారంభించనున్న 16 నియోజకవర్గాలలో రూ.40 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు ఉంటుందన్నారు. క్యూర్ పరిధిలో తొలి విడతగా ప్రయోగాత్మకంగా నిర్మించే ఇందిరమ్మ ఇళ్లలో యాజమాన్య హక్కుల రిజర్వేషన్‌కు సంబంధించి ఎస్సీలకు 14 శాతం, ఎస్టీలకు 5శాతం, బీసీలకు 16 శాతం, దివ్యాంగులకు 5 శాతం , ప్రభుత్వ అవుట్ సోర్సింగ్, 4వ తరగతి ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులకు 10 శాతం చొప్పున మొత్తం 50 శాతం రిజర్వేషన్ కల్పిస్తున్నాం. ఈ 50 శాతం రిజర్వేషన్లలో కూడా 30 శాతం మహిళలకే కేటాయిస్తున్నాం. మిగిలిన 50 శాతం వాటా జనరల్ కేటగిరీలో కేటాయిస్తాం. పేద మధ్యతరగతి ప్రజల మీద బిఆర్ఎస్ కు... ఆ పార్టీ లోని దొరలకు ఏ మాత్రం అభిమానం, ప్రేమ ఉంటే విష ప్రచారాన్ని మానుకుంటారని ఆశిస్తున్నాను. ఈ విష ప్రచారాన్ని ఇదేవిధంగా కొనసాగిస్తే జూబ్లీ హిల్స్, కంటోన్మెంట్ ఉప ఎన్నికలలో పట్టిన గతే రాష్ట్ర వ్యాప్తంగా పడుతుందని మంత్రి పొంగులేటి వ్యాఖ్యానించారు.

## గ్లోబరినాతో మీరెందుకు ఒప్పందం చేసుకున్నారు?

(మొదటిపేజీ తరువాయి)



ప్రస్తావించలేదని విమర్శించారు. లోక్‌భవన్ ముందు ధర్నా చేయాల్సింది పోయి కొడంగల్‌లో ధర్నా చేయడం రాజకీయ నాటకం మాత్రమే అని విమర్శించారు. 'గ్లోబరీనా నిజంగానే నా బినామీ సంస్థ అయితే, అదే సంస్థతో కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు ఒప్పందాలు చేసుకుంది? మీ ప్రభుత్వమే ఆ సంస్థతో ఒప్పందాలు చేసుకుని, ఇప్పుడు అది నా బినామీ సంస్థ అని చెప్పడం ఎంతవరకు సమంజసం?' అని కేటీఆర్ ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి పగలు కాంగ్రెస్‌తో.. రాత్రి బీజేపీతో ఉంటారంటూ దుయ్యబట్టారు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్‌కు ఒక మూట ఇస్తే, బీజేపీకి రెండు మూటలు పంపుతున్నారని ఆరోపించారు. నేను సీఐడీ విచారణకు సిద్ధం.. రేవంత్ రెడ్డి కుటుంబ అవినీతి అంశంలో సిట్, సీఐడీ విచారణకు సిద్ధమా' అంటే మాజీ మంత్రి సవాల్ విసిరారు. మోదీ పేరును ప్రస్తావించడానికి కూడా సీఎం భయపడుతున్నారన్నారు. ఓ వైపు పాత కేసుల భయం, మరోవైపు అమృత్ పథకం, ఇతర కాంట్రాక్టుల ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వంతో రాజీ రాజకీయాలు చేస్తున్నారన్నారు. గ్లోబరీనా సంస్థపై రేవంత్ రెడ్డి చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమన్నారు. రుజువు చేయాలని.. లేదంటే క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు

## నేడు విద్యాసంస్థల
# బంద్‌కు పిలుపు

**యూనివర్సిటీ పరిధిలో పరీక్షలు వాయిదా**

**హైదరాబాద్, జూలై 23 :** తెలంగాణ వ్యాప్తంగా ఈ నెల 24న శుక్రవారం విద్యాసంస్థల బంద్‌కు పలు విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉస్మానియా యూనివర్సిటీ (ఓయూ), జేఎన్‌టీయూ, తెలంగాణ విశ్వవిద్యాలయం (టీయూ) పరిధిలో నిర్వహించే పరీక్షలు వాయిదా పడ్డాయి. ఈ మేరకు ఆయా వర్సిటీలు ప్రకటించాయి. అనుబంధ కళాశాలల్లో జరగాల్సిన అన్ని పరీక్షలను వాయిదా వేస్తున్నామని.. త్వరలో కొత్త తేదీని ప్రకటిస్తామని ఓయూ, జేఎన్‌టీయూ, టీయూ తెలిపాయి. ఈ మేరకు అనుబంధ కళాశాలలకు సమాచారం ఇచ్చినట్లు వెల్లడించాయి. నీట్ పేపర్ లీకేజీ దోషులను శిక్షించడంతో పాటు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ పలు విద్యార్థి సంఘాలు 24న బంద్‌కు పిలుపునిచ్చాయి.

## యువత గొంతు నొక్కితే
# పతనం తప్పదు

**బిజెపికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హెచ్చరిక**



**హైదరాబాద్, జూలై 23 :** యువత గొంతు నొక్కితే బీజేపీ రాజకీయ పతనం తప్పదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యాన్ని భయపెట్టలేరని.. రాజ్యాంగాన్ని అణచలేరన్నారు. విద్యార్థుల ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా నిర్బంధాలు సరికాదని అన్నారు. ఉద్యోగాలు అడిగిన యువతకు లాఠీలు, కేసులే బీజేపీ సమాధానమన మంటూ విమర్శలు గుప్పించారు. ప్రశ్నించే హక్కు ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధమైన హక్కే అని చెప్పుకొచ్చారు. విద్యార్థుల స్వరాన్ని అణచివేయడం ప్రజాస్వామ్యానికి ముప్పని వ్యాఖ్యానించారు. యువత భవిష్యత్తుపై కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మంత్రి విమర్శించారు. విద్యార్థుల మధ్య నిలిచిన రాహుల్ గాంధీ నిజమైన ప్రజానాయకుడన్నారు. ప్రజల మధ్య ఉండే నాయకత్వానికే దేశం మద్దతిస్తుందని తెలిపారు. భయపెట్టి ప్రజల స్వరాన్ని శాశ్వతంగా అణచలేరని అన్నారు. విద్యార్థుల కలలను సంకెళ్లతో బంధించలేరని స్పష్టం చేశారు. యువత ఆశయాలను జైళ్ల గోడల మధ్య నిర్బంధించలేరన్నారు. రాజ్యాంగాన్ని ఎవరూ ఓడించలేరని.. రాజ్యాంగ పరిరక్షణ కాంగ్రెస్ చారిత్రక బాధ్యత అని వెల్లడించారు. 'యువత విద్వేషం కాదు... విశ్వాసం కోరుకుంటోంది. అహంకారం కాదు... జవాబుదారీతనం కోరుకుంటోంది. ప్రచారం కాదు... పారదర్శక పాలననే యువత కోరుకుంటోంది' అంటూ వ్యాఖ్యానించారు. 2029 ఎన్నికలు రాజ్యాంగ పరిరక్షణకు కీలకమని ఉత్తమ్ వెల్లడించారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ ప్రత్యామ్నాయం అందిస్తోందన్నారు. తెలంగాణలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన అందిస్తోందని తెలిపారు. ప్రజల గొంతు వినే ప్రభుత్వాలే చరిత్రలో నిలుస్తాయన్నారు. 'భారత్‌ను భయంతో కాదు.. ప్రజాస్వామ్యం, రాజ్యాంగంతో నడపాలి' అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు.

## కాళేశ్వరం అవినీతికి అండగా
# రేవంత్ చర్యలు

**కెసిఆర్‌ను కాపాడుతున్నది రేవంతే**

**నిజామాబాద్ బిజెపి ఎంపీ ధర్మపురి అర్వింద్ విమర్శలు**

**న్యూఢిల్లీ,జూలై23 :** కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై ఈ 30 నెలలుగా సీఎం రేవంత్ రెడ్డి ఏం చేశారని నిజామాబాద్ బిజెపి ఎంపీ ధర్మపురి అర్వింద్ సందేహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తం సీబీఐ విచారణకు ఎందుకు ఇవ్వలేదని తెలంగాణ సీఎంను ఈ సందర్భంగా ఆయన సూటిగా ప్రశ్నించారు. గురువారం న్యూఢిల్లీలో బీజేపీ ఎంపీ మాట్లాడుతూ.. రూ.30 వేల కోట్ల విలువైన పనులు జరిగిన తర్వాత ఎన్డీఎస్ఏ దగ్గరకు వచ్చారని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌తో రూ. లక్ష కోట్లు నీళ్లలో పోయాయని కేంద్ర జలశక్తి మంత్రి పార్లమెంట్‌లో చెప్పారని గుర్తు చేశారు. రూ.లక్ష కోట్లు ముంచిన కేసీఆర్‌ను రేవంత్ రెడ్డి కాపాడుతున్నాడని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో కేసీఆర్, కేటీఆర్ దోచుకున్న పైసలను ప్రస్తుతం వారి నుంచి సీఎం రేవంత్ దోచుకుంటున్నారా? అని అనుమానం వ్యక్తం చేశారు. కేసీఆర్ కుటుంబం వద్ద సీఎం రేవంత్ రెడ్డి ఎంత తీసుకున్నాడు.. ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీకి ఎంత ఇచ్చాడని ఎంపీ ధర్మపురి అర్వింద్ ప్రశ్నించారు. తెలంగాణలో సాగు, తాగు, థర్మల్ పవర్ ప్లాంట్లకు నీరు అందడం లేదని అరవింద్ ఆవేదన వ్యక్తం చేశారు.

# క్యూనెట్ పిరమిడ్ మోసం కేసు

**గోవాలో ఐదుగురు ప్రమోటర్ల అరెస్ట్**

**హైదరాబాద్, జూలై 23 :** క్యూనెట్ పిరమిడ్ మోసం కేసులో పోలీసులు ఉక్కుపాదం మోపారు. కోట్ల రూపాయల మోసానికి పాల్పడ్డారనే ఆరోపణలపై హైదరాబాద్ సీసీఎస్-ఈఓడబ్ల్యూ టీమ్-1 అధికారులు గోవాలో దాడులు నిర్వహించి ఐదుగురు నిందితులను అరెస్ట్ చేశారు. కేరళకు చెందిన ఐదుగురు ఇండిపెండెంట్ రిప్రజెంటేటివ్‌లను గోవాలోని నోవోటెల్ రిసార్ట్‌లో అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అక్కడ నిర్వహించిన ఈవెంట్ సందర్భంగా ఈ దాడులు జరిగాయి. పోలీసులను చూసి నిందితులు ముగ్గురు తప్పించుకున్నారు, వారి కోసం గాలింపు కొనసాగుతోంది. అరెస్టు చేసిన నిందితుల నుంచి పోలీసులు మూడు లగ్జరీ కార్లను స్వాధీనం చేసుకున్నారు. వాటిలో టయోటా ఫార్చ్యూనర్, కియా, ఎంజీ హెక్టర్ వాహనాలు ఉన్నాయి. అలాగే ఐదు మొబైల్ ఫోన్లు, కీలకమైన డిజిటల్ ఆధారాలను సీజ్ చేశారు. నిందితుల మొబైల్ ఫోన్లలోని వాట్సాప్ చాట్‌లు, ఇన్‌స్టాగ్రామ్ సందేశాలు, ఆర్థిక లావాదేవీల వివరాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. వీటి ఆధారంగా మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఇన్‌స్టాగ్రామ్ ద్వారా బాధితుడిని వలలోకి దింపిన నిందితులు మంచి వ్యాపార అవకాశం ఉందని నమ్మించారు. తర్వాత భారీ ఆదాయం వస్తుందని చెప్పి రూ.7.5 లక్షలు పెట్టుబడి పెట్టేలా ఒత్తిడి చేసినట్లు పోలీసులు గుర్తించారు. అలాగే గోవాలో నిర్వహించిన ఈవెంట్‌లో పాల్గొనేందుకు రూ.30 వేల డిపాజిట్ కూడా వసూలు చేసినట్లు తెలిపారు. క్యూనెట్ వంటి పిరమిడ్, మనీ సర్క్యులేషన్ స్కీమ్‌లలో కొత్త సభ్యులను చేర్చడం ద్వారా భారీ ఆదాయం వస్తుందని నిందితులు ప్రచారం చేసినట్లు పోలీసులు తెలిపారు. జూమ్ మీటింగ్‌లు, ఫోన్ కాల్స్ ద్వారా రహస్యంగా కార్యకలాపాలు నిర్వహిస్తూ బాధితులను ఆకర్షించినట్లు వెల్లడించారు. ఐటీ ఉద్యోగులు, యువత, గృహిణులు, విద్యార్థులే ప్రధాన లక్ష్యంగా ఇలాంటి మోసపూరిత స్కీమ్‌లు నడుస్తున్నాయని పోలీసులు హెచ్చరించారు. పిరమిడ్ స్కీమ్‌లు, మనీ సర్క్యులేషన్ పథకాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ పోలీసులు సూచించారు. తక్కువ సమయంలో భారీ ఆదాయం వస్తుందని చెప్పే పథకాలను నమ్మవద్దని తెలిపారు. ఇలాంటి స్కీమ్‌లను ప్రచారం చేసే వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

# విద్యార్థులకు సకాలంలో యూనిఫామ్‌లు

**నాణ్యతలో రాజీపడకుండా సరఫరా**

**క్యూర్ పరిధిలో మంచినీటి ప్రణాళికలు**

**అధికారులను ఆదేశించిన సిఎం రేవంత్ రెడ్డి**



**హైదరాబాద్, జులై 23 :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే యూనిఫామ్‌ల నాణ్యతలో రాజీపడబోమని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. పంపిణీలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థుల యూనిఫామ్‌లపై అధికారులతో సీఎం సమీక్షించారు. విద్యార్థుల యూనిఫామ్‌లు త్వరగా సరఫరా చేసేలా సంస్థలపై ఒత్తిడి తేవాలి. ఆగస్ట్ 15 నాటికి విద్యార్థులకు వాటిని అందించాలన్నారు. ఆ తర్వాత ప్రతి విద్యార్థి నుంచి అభిప్రాయాన్ని సేకరించాలి. ఆ అభిప్రాయాల ఆధారంగా వచ్చే ఏడాది యూనిఫామ్‌లు పంపిణీ చేయాలి. గత ప్రభుత్వ హయాంలో ఈ విషయంలో అడ్డగోలుగా వ్యవహరించారు. పేద పిల్లల కోసం పనిచేస్తున్నామన్న దృష్టితో అధికారులు పనిచేయాలి. వచ్చే ఏడాది జూన్ 2 నాటికే విద్యార్థులకు యూనిఫామ్‌లు అందేలా కార్యాచరణ రూపొందించాలని రేవంత్ ఆదేశించారు. ఇదిలావుంటే క్యూర్ (కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ) పరిధిలో తాగునీటి సరఫరాకు సంబంధించి సమగ్ర తాగు నీటి సరఫరా మాస్టర్ ప్లాన్‌ను రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. జీహెచ్‌ఎంసీ, మల్కాజిగిరి, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్లతో పాటు విలీన మున్సిపాలిటీల్లోనూ తాగు నీటి సరఫరాలో ఏకరూపత ఉండాలని చెప్పారు. రానున్న 50 ఏళ్ల అవసరాలకు తగినట్లు మాస్టర్ ప్లాన్ ఉండాలని ముఖ్యమంత్రి గారు సూచించారు. హైదరాబాద్ మహానగర తాగునీటి సరఫరా, సీవరేజీ బోర్డు పరిధిలోని పనులపై ముఖ్యమంత్రి ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో సమీక్ష నిర్వహించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావం నెలకొనడంతో తాగునీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. హైదరాబాద్ చుట్టూ ఉన్న తాగునీటి వనరులను అనుసంధానించా లని చెప్పారు. ఏదైనా కారణాలతో ఒక సోర్స్ నుంచి నీరు సరఫరా కాకపోయినా మరో సోర్స్ నుంచి వచ్చే నీటిని ఆయా ప్రాంతాలకు సరఫరా చేసేందుకు అనుసంధానత ఉపయోగపడుతుందని అన్నారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో అనేక సంవత్సరాలుగా పలు ప్రాంతాల్లో మూడు నాలుగు రోజులకు ఒకసారి తాగునీరు సరఫరా చేస్తున్నారని, ఇక ముందు ఆ పరిస్థితి ఉండకూడదని ముఖ్యమంత్రి గారు చెప్పారు. ఆయా ప్రాంతాలకు రోజు విడిచి రోజు నీరు సరఫరా చేసేందుకు అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని ఆదేశించారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న తాగునీటి సరఫరా పనులను ఏడాదిన్నరలోపు కచ్చితంగా పూర్తి చేయాలని అధికారులకు తేల్చిచెప్పారు. ఎస్టీపీల నిర్మాణ పనులపై ముఖ్యమంత్రి గారు ఆరా తీశారు. ఎస్టీపీల నిర్మాణాన్ని నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎక్కడైనా న్యాయపరమైన సమస్యలు ఉంటే వాటిని వేగంగా పరిష్కరించుకునేందుకు ప్రయత్నించాలని చెప్పారు. తాగునీటి సరఫరాకు సంబంధించిన పనులు, ఎస్టీపీల నిర్మాణ పనుల ప్రగతిపై ప్రతి నెల తనకు నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. పనుల పురోగతి తెలుసుకునేందుకు వీలుగా డ్యాష్‌బోర్డును ఏర్పాటు చేయాలని సూచించారు.

రానున్న రోజుల్లో పరిశ్రమలు, వివిధ నిర్మాణ పనుల్లో గ్రే వాటర్ వాడేలా నిబంధనలు రూపొందించి అమలు చేయాలని సూచించారు. సమీక్షలో మున్సిపల్ వ్యవహారాల ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ గారు, సీఎం సెక్రటరీ మాణిక్ రాజ్ , జల మండలి ఎండీ కె అశోక్ రెడ్డి , జేఎండీ మయాంక్ మిట్టల్ తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.



## తెలంగాణ శాసనసభకు ఆధునిక హంగులు

- ఆధునీకరణ పనులు పరిశీలించిన సిఎం రేవంత్
- నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలని ఆదేశం

**హైదరాబాద్,జూలై23 :** తెలంగాణ శాసనసభ భవనంలో కొనసాగుతున్న మరమ్మతు పనులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం పరిశీలించారు. ప్రజాస్వామ్యానికి ప్రతీకగా నిలిచిన శాసనసభ ప్రాంగణాన్ని మరింత మెరుగైన మౌలిక సదుపాయాలతో తీర్చిదిద్దే లక్ష్యంతో చేపట్టిన పనుల పురోగతిని ఆయన అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, అద్దంకి దయాకర్, బల్మూర్ వెంకట్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, జైవీర్ రెడ్డి తదితరులు ముఖ్యమంత్రితో కలిసి మరమ్మతు పనులను పరిశీలించారు. పనుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని, నిర్దేశించిన గడువులోగా అన్ని పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. శాసనసభకు వచ్చే ప్రజాప్రతినిధులు, అధికారులు, సందర్శకులకు మెరుగైన వసతులు కల్పించేలా అన్ని ఏర్పాట్లు ఉండాలని ఆదేశించారు. సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజాస్వామ్యానికి ప్రతీక అయిన తెలంగాణ శాసనసభ ప్రాంగణాన్ని మరింత మెరుగైన మౌలిక సదుపాయాలతో తీర్చిదిద్దేందుకు చేపట్టిన పనులు వేగంగా, నాణ్యతతో పూర్తయ్యేలా అధికారులను ఆదేశించామని తెలిపారు. శాసనసభ భవనం ఆధునిక అవసరాలకు అనుగుణంగా ఉండేలా ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోందని ఆయన పేర్కొన్నారు.

## కాంగ్రెస్‌ది చిత్తశుద్ధి లేని పోరాటం

- ప్రధాని నివాసం ముందు ధర్నా ఓ నాటకం
- సోనమ్ వాంగ్‌చుక్ భార్య విమర్శలు

**న్యూఢిల్లీ, జూలై 23 :** న్యూఢిల్లీలోని ప్రధాని నివాసం ముందు ఈనెల 21న నీట్ పేపర్ లీక్ అంశంపై కాంగ్రెస్ నిరసన కార్యక్రమం చేపట్టడాన్ని సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ భార్య గీతాంజలి విమర్శించారు. కాంగ్రెస్ నిరసనల్లో చిత్తశుద్ధి లోపించిందని అన్నారు. జంతర్‌మంతర్ వద్ద విద్యార్థులు నిరసనకు దిగినప్పుడే కాంగ్రెస్ కూడా వచ్చి నిరసనల్లో పాలుపంచుకుని ఉండాల్సిందని వ్యాఖ్యానించారు. పేపర్ లీక్ ఉదంతంపై సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ జంతర్‌మంతర్ వద్ద తొలుత ఆమరణ దీక్ష ప్రారంభించిన విషయం తెలిసిందే. ఆ తరువాత పోలీసులు ఆయనను ఆసుపత్రికి తరలించడంతో ప్రస్తుతం అక్కడే దీక్షను కొనసాగిస్తున్నారు. నిరసనల్లో రాజకీయ పార్టీలు కూడా రంగ ప్రవేశం చేయడంపై వాంగ్‌చుక్ భార్య పలు కీలక వ్యాఖ్యలు చేశారు. వాంగ్‌చుక్ పేరుప్రఖ్యాతులను తమకు అనుకూలంగా వాడుకునేందుకు రాజకీయ పక్షాలు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. అయితే, ప్రజలను మభ్యపెట్టడం ఇక సాధ్యం కాదని అన్నారు. చిత్తశుద్ధి లేని వారిని యువతే పంపించేస్తారని అన్నారు. కాక్రోచ్ జనతా పార్టీ సారథ్యంలో నిరసనలు రాజకీయ పక్షాలకు గట్టి సందేశం పంపించాయని ఆమె అన్నారు. తమ దృష్టిలో పార్లమెంటే అత్యున్నత వ్యవస్థ అని, తమకు ఇక ప్రతిపక్షం, పాలకపక్షం లేదని వ్యాఖ్యానించారు. పార్లమెంటే ఈ అంశంపై దృష్టి సారించాలని కోరుతున్నామని అన్నారు. రాజకీయ లక్ష్యాలు లేని వారు తమతో కలిసి రావచ్చని అన్నారు. నిజాయతీ, స్వచ్ఛత పునాదిగా ఈ ఉద్యమం ఆరంభమైందని గీతాంజలి చెప్పారు. సొంత ఎజెండాలతో వచ్చే వారు తమంతట తామే పక్కకు తప్పుకోవాల్సి వస్తుందని అన్నారు. పార్లమెంటు వరకూ విద్యార్థులు చేపట్టిన మార్చ్‌ను కేంద్రం అడ్డుకోవడాన్ని వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ, పార్టీ ఇతర నేతలు జులై 21న ప్రధాని నివాసం ముందు నిరసనకు దిగిన విషయం తెలిసిందే. దీంతో, పోలీసుల రాహుల్ గాంధీని అక్కడి నుంచి బలవంతంగా తరలించాల్సి వచ్చింది.

## విద్యార్థులతో చర్చలకు మేం సిద్ధం

**ఎప్పుడైనా.. ఎక్కడైనా చర్చిద్దాం రండి**

**సందేశం పంపిన కేంద్ర మంత్రి జితేంద్రసింగ్**

**న్యూఢిల్లీ,జూలై23 :** నీట్ పేపర్ లీకేజీపై ఆందోళనలు ఉధృతమైన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు ముమ్మరం చేసింది. చర్చలకు రావాలని విద్యార్థులు, కాక్రోచ్ జనతాపార్టీ (సీజేపీ) నేతలను మరోసారి ఆహ్వానించింది. 'మీకు అనుకూలంగా ఉండే సమయంలో ఎప్పుడైనా చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది' అని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ పిలుపునిచ్చారు. ఆందోళనకారులకు కేంద్రం నాలుగు ప్రతిపాదనలు చేసింది. వాటిపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఆందోళనకారుల తరఫున కొందరు వచ్చి ప్రభుత్వంతో చర్చించవచ్చు. మీరు ఎప్పుడైనా రావొచ్చు. ప్రభుత్వం తరఫున నేను, జేపీ నడ్డా చర్చలో పాల్గొంటాం అని జితేంద్ర సింగ్ పేర్కొన్నారు. జేపీ నడ్డా కార్యాలయంలోగానీ, ఆయన నివాసంలో గానీ చర్చిద్దామన్నారు. తొలుత చర్చ ప్రారంభిస్తే.. క్రమంగా సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని, అందుకు అనుగుణంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు.

## సిజెపి ఆందోళనలపై పోలీసుల దృష్టి

**హింసాత్మక ఘటనలపై పోలీసుల కూపీ**

**అవసరమైతే పాస్‌పోర్టులు రద్దు చేసేందుకు సిద్ధం ?**

**న్యూఢిల్లీ, జూలై 23 :** కాక్రోచ్ జనతా పార్టీ నిరసనల సందర్భంగా చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలపై ఢిల్లీ పోలీసులు కఠిన చర్యలకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. హింసలో పాల్గొన్న వారి పాస్‌పోర్ట్‌లను రద్దు చేసే అవకాశం ఉందని పోలీసు వర్గాలు తెలిపాయి. నిరసనల సమయంలో జరిగిన ఘటనలకు సంబంధించిన ఆధారాలను పోలీసులు సేకరిస్తున్నారు. సీసీటీవీ దృశ్యాలు, వీడియోలు, ఫొటోలు, ఇతర డిజిటల్ ఆధారాల ఆధారంగా హింసలో పాల్గొన్న వారిని గుర్తించే ప్రక్రియ కొనసాగుతున్నట్లు సమాచారం. కాగా, నీట్ పేపర్ లీక్ వ్యవహారం, విద్యావ్యవస్థలో అవకతవకలకు నిరసనగా కాక్రోచ్ జనతా పార్టీ ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఆందోళనలు చేపట్టిన సంగతి తెలిసిందే. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని సీజేపీ డిమాండ్ చేస్తోంది. ఈ నేపథ్యంలోనే బుధవారం అర్ధరాత్రి ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఆందోళనకారులు–పోలీసుల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణల్ని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు లాఠీఛార్జ్ చేయడంతో కొందరు నిరసనకారులు రాళ్లు రువ్వారు. ఈ ఘటనలో ఇద్దరు అసిస్టెంట్ పోలీస్ కమిషనర్లతో పాటు ఆరుగురు పోలీస్ సిబ్బంది గాయపడ్డారు. ఈ నేపథ్యంలోనే హింసాత్మక ఘటనల్లో పాల్గొన్న వారి పాస్‌పోర్ట్‌లను రద్దు చేసే అవకాశం ఉందని తెలుస్తోంది.

## సెలవు పెట్టినందుకు ఉద్యోగం నుంచి తొలగింపు

**టెక్ మహీంద్రా సంస్థ ఉద్యోగిని ఫిర్యాదు**

**హైదరాబాద్,జూలై23 :** ప్రముఖ ఐటీ సంస్థ టెక్ మహీంద్రాపై మహిళా సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని భావన దుండిగల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనారోగ్యం కారణంగా తాను, అనంతరం తన చిన్నారి ఆరోగ్యం బాగోలేక సెలవులు తీసుకున్న నేపథ్యంలో ఎలాంటి ముందస్తు నోటీసు ఇవ్వకుండా సంస్థ ఉద్యోగం నుంచి తొలగించిందని ఆమె ఆరోపించారు. భావన తెలిపిన వివరాల ప్రకారం, అనారోగ్యంతో 13 రోజుల పాటు సెలవులో ఉన్న సమయంలో, అలాగే తన కుమార్తె అనారోగ్యం కారణంగా మరికొన్ని రోజులు సెలవు తీసుకున్నప్పటికీ, యాజమాన్యం ఈ-మెయిల్‌ల ద్వారా వెంటనే విధులకు హాజరు కావాలని ఒత్తిడి తెచ్చిందని పేర్కొన్నారు. వ్యక్తిగత పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకుండా వేధింపులకు గురిచేశారని ఆమె ఆరోపించారు. అంతేకాకుండా, కార్యాలయంలో వాష్‌రూమ్‌కు వెళ్లాలన్నా అనుమతి తీసుకోవాల్సిన పరిస్థితి ఉండేదని, ఉద్యోగులపై అత్యంత కఠినమైన నిబంధనలు అమలు చేస్తున్నారని ఆమె ఆరోపించారు. మహిళా ఉద్యోగులకు కుటుంబ బాధ్యతలు, చిన్నారుల సంరక్షణ వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని ఐటీ సంస్థలు మరింత మానవీయ దృక్పథంతో వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. భావన ఫిర్యాదును స్వీకరించిన దుండిగల్ పోలీసులు ఘటనకు సంబంధించిన వివరాలను పరిశీలిస్తు న్నారు. మరోవైపు, ఈ ఆరోపణలపై టెక్ మహీంద్రా యాజమాన్యం నుంచి అధికారిక స్పందన రావాల్సి ఉంది.



## గ్లోబరీనా సంస్థతో నాకు సంబంధం లేదు

**క్షమాపణలు చెప్పకుంటే లీగల్ చర్యలు**

**రేవంత్ వ్యాఖ్యలపై కెటిఆర్ హెచ్చరిక**

**హైదరాబాద్,జూలై23 :** 2019 ఇంటర్ ఫలితాల్లో కేటీఆర్ బినామీ సంస్థ గ్లోబరీనా అవకతవకలకు పాల్పడిందని సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో మండి పడ్డారు. ముఖ్యమంత్రి హోదాకు తగిన విధంగా ఒక్కసారైనా వ్యవహరించాలని సూచించారు. పేపర్ లీక్ వంటి అత్యంత దురదృష్టకర ఘటనను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తూ తప్పుడు ప్రచారం చేయడం ముఖ్యమంత్రి పదవికే మచ్చ తెచ్చే చర్య అని ఆయన ఆరోపించారు. గ్లోబరీనా సంస్థతో బీఆర్‌ఎస్‌కు, తన కుటుంబానికి లేదా తనకు ఎలాంటి సంబంధం లేదని కేటీఆర్ మరోసారి స్పష్టం చేశారు. ఈ విషయంలో చేసిన ఆరోపణలపై క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో న్యాయపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని తెలిపారు. దీనికి సంబంధించి తమ న్యాయ బృందం త్వరలోనే ముఖ్యమంత్రికి లీగల్ నోటీసు పంపనున్నట్లు వెల్లడించారు. అలాగే, ముఖ్యమంత్రి తరచూ తనపై అసభ్యకరమైన, ఆధారరహిత ఆరోపణలు చేస్తున్నప్పటికీ వాటికి తాను ఎక్కువగా స్పందించలేదని కేటీఆర్ పేర్కొన్నారు. తన మౌనం ఆరోపణలను అంగీకరించినట్లు కాదని, నిరాధార విమర్శల స్థాయికి దిగజారి వాదించడం తనకు ఇష్టం లేదని వ్యాఖ్యానించారు.

## ఎల్‌నినోతో రాష్ట్రంలో తీవ్ర వర్షాభావం

**అధికారులతో మంత్రి పొన్నం సమీక్ష**

**కార్యాచరణతో ముందుకు సాగాలని సూచన**




**సిద్దిపేట, జూలై 23 :** ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. దీనినుంచి బయటపడేలా కార్యాచరణతో సాగాలని అన్నారు. గురువారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ఐఓసీ కార్యాలయంలో సిద్దిపేట, కరీంనగర్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు, అధికారులతో ఎల్‌నినో ప్రభావంపై మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హుస్నాబాద్ నియోజకవర్గంలోని ఏడు మండలాల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ..గ్రామీణ ప్రాంతాల్లో అధికారులు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. స్వేచ్ఛగా ఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. భవిష్యత్తులో తాగునీటికి సంబంధించి ప్రధాన సమస్య వచ్చే అవకాశం ఉందని తెలిపారు. వచ్చే జూన్ వరకు వర్షాలు లేవని శాస్త్రవేత్తలు చెబుతున్నారన్నారు. పశువులకు పశుగ్రాసం ఇబ్బందులు తలెత్తకుండా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. వ్యవసాయానికి సంబంధించి కరవు పరిస్థితిలో ఆరుతడి పంటలు వేయాలని అన్నదాతలకు సూచిస్తున్నామని అన్నారు. గ్రౌండ్ వాటర్ రోజురోజుకూ పడిపోతోందని.. దీనిని పెంచేందుకు ప్రత్యేక యాక్షన్ ఎ÷-లాన్ ద్వారా ముందుకెళ్లాలని దిశానిర్దేశర చేశారు. వీబీజీ రాంజీ ఉపాధి హామీ పథకం కింద ఇంకుడు గుంతలు తవ్వే అవకాశం ఉందని వెల్లడించారు. ప్రతి వర్షం చుక్కను కాపాడుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. ఈ సమావేశంలో సిద్ధిపేట జిల్లా కలెక్టర్ హైమవతి, కరీంనగర్ జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పేయి, ఆయా జిల్లాల అదనపు కలెక్టర్లు, వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. తాగునీటి సరఫరా, సాగునీటి నిర్వహణ, పశుగ్రాసం, చెరువుల్లో నీటి నిల్వలు, ఇతర అత్యవసర చర్యలపై సమీక్ష నిర్వహించారు. తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రౌండ్ వాటర్ పెంపునకు ఇంకుడు గుంతల తవ్వకం, రైతులు ఆరుతడి పంటలు, ఆయిల్ ఫామ్ సాగు చేపట్లేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని, అవసరమైన వనరులను సిద్ధంగా ఉంచాలని సమావేశంలో నిర్ణయించారు.

## పేరు మార్చుకుని పెత్తనం చేస్తున్న గ్లోబరీనా

**కెటిఆర్‌కు ప్రత్యక్ష సంబంధాలు**

**కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ ఆరోపణ**



**హైదరాబాద్,జులై 23 :** సిఓ ఇఎంటి సంస్థ తెలంగాణలోనే పుట్టిందని, ఆ సంస్థతో కేటీఆర్‌కు సంబంధాలున్నాయని కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ ఆరోపించారు. ఆ సంస్థ నిర్మించిన ఫామ్‌హౌస్‌లోనే కేటీఆర్ ఉంటున్నారని, సంస్థకు సంబంధించిన భూములు కూడా ఆయన వద్ద ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే 2019లో ఇంటర్ పరీక్షల నిర్వహణకు గ్లోబరీనా సంస్థకు అక్రమంగా టెండర్లు కేటాయించారని, ఆ సంస్థపై జేఎన్‌టీయూ హైదరాబాద్, జేఎన్‌టీయూ కాకినాడలో కేసులు నమోదైనా చర్యలు తీసుకోలేదన్నారు. 26 మంది విద్యార్థుల ఆత్మహత్యలకు కారణమైన వ్యవస్థపై అప్పటి ప్రభుత్వం స్పందించలేదని, దీనిపై కేటీఆర్ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ప్రభుత్వ విప్ బల్మూర్ వెంకట్ తీవ్ర విమర్శలు చేశారు. విద్యార్థుల సమస్యలపై మాట్లాడే నైతిక హక్కు కేటీఆర్‌కు లేదని, వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో ధర్నా చేస్తున్న విద్యార్థులపై జరిగిన దాడిని బీఆర్‌ఎస్ ఖండించలేదని, బీజేపీని ప్రశ్నించే ధైర్యం కూడా ఆ పార్టీకి లేదని అన్నారు. అలాంటి పరిస్థితుల్లో కేటీఆర్ మహాధర్నా చేపట్టడం సిగ్గుచేటని విమర్శించారు. శాంతియుతంగా నిరసనలు చేపడితే ప్రభుత్వం ఎలాంటి అడ్డంకులు సృష్టించదని, కానీ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే మాత్రం చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కొత్త పేరుతో మరో సంస్థను ఏర్పాటు చేసి సీబీఎస్‌ఈతో కూడా వ్యవహరిస్తోందని బల్మూర్ వెంకట్ ఆరోపించారు. ఇప్పుడు విద్యార్థుల కోసం పోరాడుతున్నట్లు కేటీఆర్ మాట్లాడడం హాస్యాస్పదమని అన్నారు. నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో కూడా కేటీఆర్ ప్రమేయంపై అనుమానాలు ఉన్నాయని ఆరోపించారు. బీఆర్‌ఎస్ పాలనలో పేపర్ లీకేజీలు ఎక్కువగా జరిగాయని విమర్శించారు. ఇదిలా ఉంటే.. కేటీఆర్ బర్త్‌డే వేడుకలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు బల్మూర్ వెంకట్. కేటీఆర్ తన పుట్టిన రోజు కోసం పదిరోజుల ముందే దుబాయ్ వెళ్లారని, అక్కడ సినీ పరిశ్రమకు చెందిన కొందరితో కలిసి బర్త్‌డే పార్టీ జరుపుకున్నారని అన్నారు. దుబాయ్ నుంచి తిరిగి వచ్చిన తర్వాత మూడు రోజుల పాటు పూర్తిగా రెస్ట్ మోడ్‌లో ఉన్నారని, ఆ తర్వాత ఒక్కసారిగా విద్యార్థుల ధర్నా పేరుతో డ్రామా ప్రారంభించారని బల్మూరి వెంకట్ విమర్శించారు. విద్యార్థుల సమస్యలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవద్దని ఆయన సూచించారు.

## డిజిపి కార్యాలయంలో కానిస్టేబుల్ ఆత్మహత్య

- సర్వీస్ తుపాకీతో కాల్చుకున్నట్లు గుర్తింపు
- సూసైడ్ నోట్ ఆధారంగా పోలీసుల దర్యాప్తు



**హైదరాబాద్, జూలై 23 :** నగరంలో కానిస్టేబుల్ ఆత్మహత్య తీవ్ర కలకలం రేపుతోంది. తెలంగాణ రాష్ట్ర డీజీపీ కార్యాలయంలో కానిస్టేబుల్ స్వామి తన సర్వీస్ తుపాకీతో కాల్చుకుని బలవన్మర ణానికి పాల్పడ్డారు. గురువారం తెల్లవారుజామున 5:30 గంటల ప్రాంతంలో వాష్‌రూమ్‌లో స్వామి ఆత్మహత్య చేసుకున్నారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. స్వామి గ్రేహౌండ్స్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఘటనా స్థలిలో కానిస్టేబుల్ రాసిన సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 'ఏదైనా తప్పు చేసి ఉంటే నేను మాత్రమే చేశాను. నా భార్య, పిల్లలు ఏ తప్పూ చేయలేదు. నా భార్య, పిల్లల్ని ఏమీ అనొద్దు. వాళ్లు మంచివాళ్లు. నేను చనిపోయిన తర్వాత ఎవరైనా నా భార్యను పిల్లల్ని వేధించినా, హింసించినా దెయ్యమై వదిలిపెట్టను. ఎందుకంటే వాళ్లు అంటే నాకు చాలా ఇష్టం. అమ్మని, అక్కని జాగ్రత్తగా చూసుకో' అంటూ కొడుకుకు సూచిస్తూ డైరీలో స్వామి సూసైడ్ నోట్ రాశారు. కానిస్టేబుల్ బలవన్మరణంపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. స్వామి ఆత్మహత్యకు గల కారణాలపై ఆరా తీస్తున్నారు. కానిస్టేబుల్ మృతదేహాన్ని డీజీపీ కార్యాలయం నుంచి ఉస్మానియా మార్చురీకి తరలించారు. క్లూస్ టీం, ఫోరెన్సిక్ అధికారులు అక్కడకు చేరుకుని ఆధారాలను సేకరించే పనిలో ఉన్నారు. కానిస్టేబుల్ స్వామి రాసిన సూసైడ్ నోట్‌పై అధికారులు దర్యాప్తు చేపట్టారు. అయితే స్వామి సూసైడ్‌కు బెట్టింగ్ కారణమని ఉన్నతాధికారులు అనుమానిస్తున్నారు. విషయం తెలిసిన వెంటనే స్వామి కుటుంబసభ్యులు డీజీపీ కార్యాలయానికి చేరుకున్నారు. కానిస్టేబుల్ మృతితో భార్య, పిల్లలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

జనం వార్త
ప్రతి అక్షరం.. జనం కోసం..

# యువత ఆక్రోశానికి.. సమాధానమేదీ?




**పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సోమవారం ప్రారంభం అయ్యాయి. వరుసగా నాలుగోరోజు కూడా ఉభయ సభల్లో గందరగోళం నెలకొంది. సమావేశాలు సజావుగా సాగడం లేదు. నీట్ లీకేజీపై ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో కాక్రోచ్ జనతాపార్టీ ఆందోళనలకు దిగింది. నీట్ లీకేజీకి బాధ్యతగా కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో సంసద్ చలో ఆందోళనకు పిలుపునిచ్చింది. వారి ఆందోళనలో వందశాతం న్యాయం ఉంది. ఎందుకంటే పరీక్షలను కూడా సక్రమంగా నిర్వహించలేని అసమర్థులు...పాలకులు అయినప్పుడు ప్రజలు స్పందిస్తారు. నిలదీస్తారు. నీట్ పరీక్ష వల్ల జరిగిన గందరోగళం ఎందరినో బలితీసుకుంది. ఎందరో తల్లిదండ్రులు క్షోభకు గురయ్యారు. దీనిని ఓ చిన్న సమస్యగా ప్రభుత్వం భావించి ఉండవచ్చు. కానీ విద్యార్థులకు మాత్రం ఇది జీవన్మరణ సమస్య.**

ఇకపోతే నాలుగు రోజులుగా గందరగోళం జరుగుతున్నా ప్రధాని మోడీ మౌనం వీడడం లేదు. కేవలం ఎక్స్ వేదికగా కఠినంగా వ్యవహరిస్తామని, నీట్ దోషుల కోసం ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేస్తామని ప్రకటించి చేతులు దులుపుకున్నారు. దేశంలో ఓ పెద్ద ఆందోళన జరుగుతంటే ఇదేనా ప్రధానిగా ఉన్న వ్యక్తి చేయాల్సిన పని. మణిపూర్ అల్లర్లు, ఢిల్లీలో రైతుల ఆందోళన, నీట్ పరీక్షా పేపర్ లీకేజీ, అయోధ్య విరాళాల చోరీ..ఇటీవల వరుసగా జరిగిన సంఘటనలు దేశాన్ని కుదిపేస్తున్నాయి. వీటిపై పార్లమెంటులో చర్చించడం జరగాలి. ప్రధాని మోడీ మౌనం వీడి పార్లమెంట్‌కు వచ్చి, నేరుగా సమాధానం చెప్పాల్సిన ముఖ్యమైన అంశాలు. దివంగత ప్రధాని మన్మోహన్ సింగ్‌ను మౌనమునిగా విమర్శించిన మోడీ ఇప్పుడు అంతకు మించి మౌనంగా మారారు. పార్లమెంట్ జరుగుతన్నా రాకుండా చోద్యం చూస్తూ ఎక్స్‌లో పోస్టులు పెట్టడం సరికాదు. ఇక్కడ సమాధానం చెప్పడం అంటే దేశప్రజలకు సమాధానం చేరవేయడంగా గుర్తించాలి. బాధ్యతగల ప్రధానిగా మోడీ పార్లమెంట్‌కు వచ్చి సమాధానం ఇవ్వాలి. కానీ అలా జరగడం లేదు. ఇంతకన్నా దౌర్భాగ్యం మరోటి లేదు. ఆయన వందిమాగధులు ఇదంతా విపక్షాలతో తమకున్న పంచాయితీలాగా సవాళ్లు విసరుతు న్నారు. దేశం తీవ్ర ఆందోళనలో ఉంటే ఇదేనా పాలక పార్టీ వ్యవహ రించే తీరు. ఇకపోతే దేశంలోని వ్యవస్థల్లో అవినీతి పాతుకుపోయిందనడానికి నీట్ పేపర్ లీకేజీ వంటివి పరాకాష్టగా చూడాలి. అవినీతి అన్నది రాజకీయ నాయకుల హక్కు గా మారింది. ప్రజలను ఏమార్చి, అధికారం చేపట్టగానే, ఓటు బ్యాం కు రాజకీయా లు తప్ప దేశహితం, దేశాన్ని ముందుకు తీసుకుని వెళ్లేందుకు అసవరమైన నిర్ణయాలు తక్కువే జరుగుతున్నాయి.

ఇటీవల రామమందిరంలో విరాళాల చోరీ ఘటన తెలిసిందే. అవినీతి కేసుల్లో దోషులకు మరణశిక్ష విధించాలి. అవినీతి సాధారణమేనని సగటు భారత పౌరులు ఆలోచించే పరిస్థితి నెలకొన్నది. దొరికే వరకు కూడా ఇది తప్పు అని కూడా భావించడంలేదు. వ్యవస్థలో అవినీతిని రూపుమాపాలని ప్రభుత్వం నిజంగా భావిస్తే, చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలి. చట్టాన్ని సవరించాలి. దోషులకు మరణ శిక్ష విధించేలా మార్పులు చేయాలి. ఉన్న చట్టాలతోనే కఠిన శిక్షలు విధించాలి. ఇకపోతే దేశంలో విద్యా వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందనడంలో ఎలాంటి సందేహం అక్కర్లేదు. గత పదేళ్లలో ఏకంగా 152 పోటీ పరీక్షల ప్రశ్నాపత్రాలు లీక్ అయ్యాయని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఆరోపించారు. సగటున నెలకు ఒక పేపర్ లీక్ అవుతున్నా బాధ్యులైన వారికి పడిన శిక్షలు మాత్రం సున్నా అని ధ్వజమెత్తారు. నిజంగానే ఇది ముమ్మాటికీ నిజం. నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీకి నిరసనగా శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జ్ చేయడానికి ముందే ప్రధాని మోడీ పార్లమెంటులో స్పందించి ఉంటే ఈ గందరగోళం చెలరేగేది కాదు. ప్రతి ఆందోళనను రాజకీయ కోణంలో చూడడం, విపక్షాలను తిట్టిపోయడం వల్ల సమస్యలను పాలకులు గుర్తించడం లేదు. ఒకప్పుడు ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిన భారత విద్యా వ్యవస్థ.. అక్రమాలు, లీకేజీలకు నిలయంగా మారింది.

దేశంలో పేపర్ లీకేజీలు ఒక పెద్ద మాఫియాగా మారాయి. దీని వెనుక ఉన్న బడాబాబులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవడంలో విఫలం అవుతూ వస్తోంది. జంతర్ మంతర్ వద్ద భారతీయ యువత నిరసనలను సీరియస్‌గా తీసుకోవాల్సి ఉండగా, దానిని అణచివేయడం ఎలా అన్న ఆలోచననే అధికారపక్షం ఆలోచన చేయడం సరికాదు. నిరసనల్లో లక్ష మందికి పైగా యువకులు, విద్యార్థులు పాల్గొని ఉంటారని ఫోటోలు స్పష్టంగా సూచిస్తున్నాయి. తొలుత ఒక మార్చ్‌గా అనుకున్నది తరువాత నిరసన ప్రదర్శనగా పరిణమించింది. ఎంతోకాలంగా ఆగ్రహంతో ఉన్న యువత ఈ అవకాశాన్ని అనుకూలంగా తీసుకుని, వెల్లువెత్తి జనసంద్రంగా మారినట్లు మనకు కనిపిస్తోంది. మన దేశంలో రాజకీయ పార్టీల ర్యాలీలకు డబ్బులు, ఇతర ప్రలోభాలతో జనాన్ని సమీకరించడం పరిపాటి. అయితే ఈ నిరసన ప్రదర్శన అలా జరగలేదు. జంతర్ మంతర్‌కు చేరిన వారందరూ తమకు తాముగా స్వచ్ఛందంగా వచ్చినవారే. ప్రతి ఒక్కరూ సామాజిక మాధ్యమాలలో విజ్ఞప్తులకు ప్రతిస్పందించి స్వచ్ఛందంగా వచ్చినవారే. ఎవరి ప్రయాణ ఏర్పాట్లు వారే చేసుకుని, సుదూర ప్రాంతాల నుంచి నడిచి వచ్చినవారు చాలామంది ఉన్నారు. ఇంకో ముఖ్య విషయమేమంటే వచ్చిన వారిలో యువ మహిళల శాతం అత్యధికంగా ఉండడం. ఈ నిరసన ప్రదర్శనలో పాల్గొన్నవారిలో అత్యధికులు ఇటువంటి నిరసనలలో తొలిసారి పాల్గొన్నవారే కావడం మరో వాస్తవం. కేవలం నీట్ తదితర ప్రశ్నపత్రాల లీక్‌కు రగిలిపోయి మాత్రమే యువత జంతర్ మంతర్ వద్ద ధర్నాకు రాలేదని ఖచ్చితంగా చెప్పవచ్చు. దేశంలో పెచ్చరిల్లు తోన్న నిరుద్యోగం, అవినీతిమయమైన అధికార వ్యవస్థలు, రాజకీయ పార్టీల కపటాలు అన్నీ కలగలిపి వారిని ఈ నిరసనలో పాల్గొనేలా ప్రోత్సహించాయనే చెప్పాలి. విద్యాభ్యాసాన్ని పూర్తిచేసుకుని ఉద్యోగాలను వెతుక్కుంటున్న వారు, నియామకాలలో అవకతవకలకు బాధితులైనవారు ఎందరో ఆ నిరసనకారుల్లో ఉన్నారని చెప్పక తప్పదు. దేశ పాలనావ్యవస్థల్లో అవినీతి మితిమీరి, రాజకీయ అవినీతి పెరిగి పోవడం, పాలకుల విలాసాలు, ప్రజలేమో అవస్థల పాలవుతున్న తీరు కారణంగా యువత నిరసనలకు ఉద్యమించిందని చెప్పక తప్పదు. దీనికి విదేశీ హస్తం ఉందనో లేదా మరే ఇతర కారణాలనో చూపి మసిపూసి మారేడుకాయ చేసే ప్రయత్నాలు కూడా మంచిది కాదు. సమస్యలను గుర్తించి పాలకలు తమ తీరును మార్చుకోవాలి. ఇది కేంద్ర రాష్ట్రాల పాలకలుకు ఓ హెచ్చరిక కావాలి.

# నీట్‌పై విద్యార్థుల ఆక్రందన సబబే

- దానికి సానుకూలంగా స్పందించాల్సిందే
- ప్రభుత్వ విధానాలను తూర్పారా బట్టిన కమల్ హాసన్




**న్యూఢిల్లీ, జులై 23 :** ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నీట్ పరీక్షకు వ్యతిరేకంగా విద్యార్థులు చేపట్టిన నిరసనలకు ప్రముఖ నటుడు, రాజ్యసభ ఎంపీ కమల్ హాసన్ మద్దతు ప్రకటించారు. విద్యార్థుల ఆందోళనలపై స్పందిస్తూ కేంద్ర ప్రభుత్వ విధానాలపై ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆయన పోస్టు పెట్టారు. 'ఒక బిడ్డ ఏడ్చినప్పుడే మనం వినాల్సింది. కానీ ఎంతోమంది పిల్లలు ప్రాణాలు కోల్పోయే వరకు వేచి చూశాం. నేర్చుకోవడం స్థానంలో శిక్షణ, జిజ్ఞాస స్థానంలో ఆందోళన, ప్రతిభ స్థానంలో నేర ప్రవృత్తి చోటుచేసుకుంది. ఇది కుళ్లిపోయిన వ్యవస్థ' అని వ్యాఖ్యానించారు. విద్యార్థులకు సమాధానాలు, అవకాశాలు అందించాల్సిన వ్యవస్థ వారిని అడ్డంకులు, ఒత్తిళ్లు, నిరాశల వైపు నెట్టివేస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 'పిల్లలకు సమాధానాల బదులుగా అడ్డంకులు, లాఠీలు ఎదురైతే అది ఒక దేశ వైఫల్యానికి సంకేతం' అని పేర్కొన్నారు. సామాజిక కార్యకర్త, విద్యా సంస్కరణల కోసం పోరాడుతున్న సోనమ్ వాంగ్‌చుక్‌ను ఉద్దేశించి కమల్ హాసన్ ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. 'దేశానికి రాబోయే ప్రయాణంలో మీ అవసరం ఉంది. దయచేసి మీ నిరాహార దీక్షను విరమించండి' అంటూ కోరారు. అదేవిధంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన భావోద్వేగ సందేశం ఇచ్చారు. 'భారతదేశ బిడ్డలారా.. మీరే మాలో ఉత్తములు. మీరు మీ కర్తవ్యాన్ని నెరవేర్చారు. ఇప్పుడు దేశం మీకు తన కర్తవ్యాన్ని నెరవేర్చాల్సిన సమయం వచ్చింది. మీ కలలు ఎల్లప్పుడూ మా వైఫల్యాల కన్నా ఉన్నతంగా నిలవాలి' అని పేర్కొన్నారు. జంతర్ మంతర్ వద్ద కొనసాగుతున్న నీట్ వ్యతిరేక నిరసనలకు రాజకీయ, సామాజిక వర్గాల నుంచి మద్దతు పెరుగుతున్న నేపథ్యంలో కమల్ హాసన్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. విద్యార్థుల భవిష్యత్తు, విద్యావిధానం, ప్రవేశ పరీక్షలపై జాతీయ స్థాయిలో చర్చ మళ్లీ వేడెక్కుతోంది.

# దమ్ముంటే నీట్‌పై చర్చకు రావాలి

## విపక్షాలకు బిజెపి అధ్యక్షుడు నితిన్ నబిన్ సవాల్



**న్యూఢిల్లీ, జులై 23 :** దేశంలో ప్రకంపనలు పుట్టిస్తోన్న నీట్ పరీక్ష వ్యవహారం, పేపర్ లీక్‌ల అంశంపై పార్లమెంట్ వేదికగా ఓపెన్ డిబేట్‌కు సిద్ధమా అని భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ విపక్షాలకు సవాల్ విసిరారు. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో పాటు విపక్ష కూటమి పార్లమెంట్‌లో చర్చకు రాకుండా పారిపోతోందని, సభ ముందుకు వస్తే వారి 'ద్వంద్వ నీతి' బయట పడుతుందనే భయంతోనే వెనకడుగు వేస్తున్నారని నితిన్ నబిన్ ఆరోపించారు. పేపర్ లీక్ దోషులకు కఠిన శిక్షలు ఖరారు చేసేందుకు 'ఫాస్ట్ ట్రాక్ కోర్టులు' ఏర్పాటు చేస్తామని ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ప్రకటన అనంతరం రాహుల్ గాంధీ తీవ్ర విమర్శల నేపథ్యంలో బీజేపీ అధ్యక్షుడు ఈ వ్యాఖ్యలు చేశారు. మీడియాతో మాట్లాడిన నితిన్ నబిన్ ప్రతిపక్షాల తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 'విద్యార్థులు, యువత భవిష్యత్తుకు సంబంధించి ప్రతి అంశంపైనా లోక్‌సభలో చర్చించేందుకు ఎన్డీఏ ప్రభుత్వం పూర్తి సిద్ధంగా ఉంది. ఔఇఇఃు సహా ఏ అంశం పైనైనా చర్చకు మేము సిద్ధం, మీరు సిద్ధమా? పార్లమెంట్ వేదికగా చర్చకు రావాలని రాహుల్ గాంధీకి సవాల్ విసురుతున్నాం' అని ఆయన అన్నా రు. 'రాహుల్ గాంధీ రాజకీయ ప్రస్థానం అంతా పారిపోవడమే. దాదాపు 50-60 ఏళ్లుగా యువతను వంచించడం, రెచ్చగొట్టడం, దారి మళ్లిం చడమే కాంగ్రెస్ చరిత్ర. అందుకే సభలో చర్చకు వస్తే తమ రంగు బయట పడుతుందని భయపడుతున్నారని ఆయన ఎద్దేవా చేశారు.

# ఆందోళనకారులకు మద్దతుగా నిలిచిన యువతి

- పోలీస్ వ్యాన్‌కు అడ్డంగా నిలబడి ఆందోళనకారుల విడుదలకు యత్నం
- నెట్టింట చక్కర్లు కొడుతున్న వీడియో

**ముంబై, జూలై 23 :** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలంటూ, పరీక్షల నిర్వహణలో అక్రమాలు జరిగాయంటూ.. దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తున్నాయి. ఈ నేపథ్యంలో మహారాష్ట్రలోని ముంబైలో చోటుచేసుకున్న ఓ ఘటన నెట్టింట తెగ వైరల్ అవుతోంది. ఆందోళనకారులను తీసుకెళ్తున్న పోలీసు వ్యాన్‌కు ఓ యువతి అడ్డుగా నిలిచి నిరసన తెలిపారు. దాదర్‌లోని శివాజీ పార్క్ సమీపంలో జరిగిన విద్యార్థుల నిరసనల్లో రియా యాదవ్ అనే యువతి ఈ సాహసానికి పాల్పడ్డారు. వర్షంలో హుడీ, టోపీ ధరించి పోలీసు వ్యాన్ ఎదుట నిల్చున్న ఆమెను చూసి.. అక్కడి నిరసనకారులు మరింత రెచ్చిపోయారు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. దీంతో అప్పటికే అదుపులోకి తీసుకున్న కొందరు నిరసనకారులను పోలీసులు విడుదల చేసినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా రియా స్పందిస్తూ.. 'పోలీసులు తమ బాధ్యతల్ని సక్రమంగా నిర్వర్తించడం లేదు. వారు బాధ్యతగా వ్యవహరించకపోతే పౌరుల కోసం మేమే బాధ్యత తీసుకుంటాం' అని అన్నారు. తాను విద్యార్థిని కాకపోయినప్పటికీ.. విద్యార్థుల ఉద్యమానికి సంపూర్ణ మద్దతిస్తానని ఆమె చెప్పుకొచ్చారు. మరోవైపు.. ఢిల్లీలో నిరసనకారులపై టియర్‌గ్యాస్, లాఠీఛార్జ్ వంటి ఘటనలనూ ఆమె ఖండించారు. రియా యాదవ్.. నటి, మోడల్, పారిశ్రామికవేత్తగా గుర్తింపు పొందారు. ఆమెకు ఇన్‌స్టాగ్రామ్‌లో సుమారు లక్ష మంది వరకు ఫాలోవర్స్ ఉన్నారు. పలు మ్యూజిక్ వీడియోల్లో నటించిన ఆమె.. ఇటీవల 'దిల్‌బారా' అనే సాంగ్‌తో మెరిశారు. అలాగే 'రియాసత్' పేరుతో ఓ చేనేత వస్త్రాల బ్రాండ్‌నూ నిర్వహిస్తున్నట్టు సమాచారం.

# తిరుమలను రాజకీయాలకు వేదికగా వాడొద్దు: భానుప్రకాశ్

**న్యూఢిల్లీ,జూలై23 :** తిరుమలను రాజకీయాలకు వేదికగా మార్చొద్దని టీటీడీ బోర్డు మెంబర్ భాను ప్రకాశ్ రెడ్డి వ్యాఖ్యానించారు. సనాతన ధర్మాన్ని రాజకీయాలకు వాడొద్దని వైసీపీ నేతలను హెచ్చరించారు. ఆంజనేయస్వామి విగ్రహాన్ని 24 గంటల్లోనే పున: ప్రతిష్ఠించామని స్పష్టం చేశారు. ఢిల్లీ వేదికగా మీడియాతో భాను ప్రకాశ్ రెడ్డి గురువారం మాట్లాడారు. వైసీపీ హయాంలో దేవాలయాలపై దాడులు జరిగాయని విమర్శించారు. కరుణాకర్ రెడ్డి ఆధారాలతో మాట్లాడాలని భాను ప్రకాశ్ రెడ్డి సవాల్ చేశారు. టీటీడీ నిధుల మళ్లింపుపై వైసీపీని ప్రశ్నించారు. ఎన్డీఏ హయాంలో దేవాలయాల పరిపాలన పారదర్శకంగా సాగుతోందని వ్యాఖ్యానించారు. ఏ అంశంపైనా బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ చేశారు. అసత్య ప్రచారాలు మానుకోవాలని వైసీపీ నేతలను భాను ప్రకాశ్ రెడ్డి హెచ్చరించారు.



# విద్యార్థుల భవిష్యత్ నాశనం చేసిందే బిజెపి

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే

## మోడీ ట్వీట్‌పై రాహుల్, అభిజిత్ దీప్కె

**న్యూఢిల్లీ, జూలై 23 :** నీట్ పేపర్ లీకేజీపై దేశ రాజధాని ఢిల్లీలో ఆందోళనలు కొనసాగుతూనే ఉన్నాయి. కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న ఉద్యమాన్ని చూసి కేంద్ర ప్రభుత్వం స్పందించింది. పేపర్ లీకేజీ బాధ్యులపై ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసి చర్యలు తీసుకుంటామని గురువారం ఉదయం ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా తెలిపారు. అయితే ప్రధాని మోదీ ట్వీట్‌పై లోకసభ విపక్ష నేత, సీజేపీ గట్టి కౌంటర్ ఇచ్చాయి. విద్యార్థుల జీవితాలను దెబ్బ తీసింది కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమేనని ఆరోపించాయి. ప్రధాని నరేంద్ర మోదీ ట్వీట్‌పై రాహుల్ గాంధీ ఘాటుగా స్పందించారు. విద్యార్థుల జీవితాలను నాశనం చేసిన కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ విద్యార్థులకు క్షమాపణలు చెప్పి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నేరానికి పాల్పడిన దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని రాహుల్ గాంధీ ట్వీట్ చేశారు. మరోవైపు సీజేపీ కూడా మోదీ ప్రకటనపై దీటుగా స్పందించింది. మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతక బాధ్యత వహిస్తూ రాజీనామ చేయాలన్నారు. విద్యార్థులపై విచక్షణారహితంగా దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. తమ డిమాండ్స్ నెరవేర్చే వరకు ఉద్యమాన్ని ఆపే ప్రసక్తే లేదని స్పష్టం చేసింది.

# బ్యాటరీ పేలి బాలుడు మృతి

**ఆసిఫాబాద్, జూలై 23 :** కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి మండలం గూడెం గ్రామానికి చెందిన నికాడి శారద-గణెళిశ్ దంపతుల పెద్ద కొడుకు లోకేశ్ (14) స్థానిక పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. బుధవారం ఉదయం లోకేశ్ ఇంట్లో కరెంట్ స్విచ్‌బోర్డు వద్ద బ్యాటరీలతో సరదాగా వివిధ ప్రయోగాలు చేశాడు. ఒక సారిగా పెద్ద శబ్దంతో బ్యాటరీ పేలగా లోకేశ్ ముఖం, చేతులు పగిలిపోయి తీవ్ర గాయాలయ్యాయి. బాలుడిని సిర్పూర్-టీ ప్రభుత్వ దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.



# కోచింగ్ సెంటర్లకు దాసోహంగా మారిన నీట్

## వెంటనే రద్దు చేసి రాష్ట్రాలకే బాధ్యతలు ఇవ్వాలి

## విద్యార్థుల ఆందోళనకు మద్దతు పలికిన మాజీ సిఎం స్టాలిన్

**చెన్నై, జులై 23 :** ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నీట్‌కు వ్యతిరేకంగా విద్యార్థులు చేపట్టిన నిరసనలపై తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ స్పందించారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులకు తన పూర్తి మద్దతు ప్రకటించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆయన పోస్టు పెట్టారు. నీట్ పరీక్షను నిలిపివేయడమే విద్యార్థుల సమస్యలకు ఏకైక పరిష్కారమని పేర్కొన్నారు. 'రాష్ట్రాలను నమ్మండి.. నీట్‌ను రద్దు చేయండి' అని డిమాండ్ చేశారు. నీట్ ప్రవేశపెట్టిన మూడు ప్రధాన లక్ష్యాల్లోనూ ఈ వ్యవస్థ పూర్తిగా విఫలమైందని స్టాలిన్ ఆరోపించారు. విద్యలో సమాన అవకాశాలు కల్పించడం, పారదర్శకత పెంచడం, నాణ్యమైన విద్యను ప్రోత్సహించడం వంటి లక్ష్యాలు సాధించడంలో నీట్ విఫలమైందని విమర్శించారు. పాఠశాల విద్యా వ్యవస్థను బలహీనపరిచి, కోచింగ్ సెంటర్ల ఆధిపత్యాన్ని పెంచే పరిస్థితిని నీట్ తీసుకువచ్చిందని పేర్కొన్నారు. విద్యార్థుల ఆవేదన, ఆందోళనలు కేంద్ర ప్రభుత్వానికి కనువిప్పు కావాలని స్టాలిన్ వ్యాఖ్యానించారు. విద్యార్థుల భవిష్యత్తు, సామాజిక న్యాయం, రాష్ట్రాల హక్కులను దృష్టిలో ఉంచుకుని కేంద్రం తన వైఖరిని పున: సమీక్షించాల్సిన అవసరం ఉందని సూచించారు. సామాజిక న్యాయాన్ని పరిరక్షించాలంటే నీట్ రద్దు అత్యవసరమని స్పష్టం చేశారు. గ్రామీణ, పేద, వెనుకబడిన వర్గాల విద్యార్థులకు నీట్ అన్యాయం చేస్తోందని అభిప్రాయపడ్డారు. విద్యార్థుల హక్కుల కోసం పోరాటం కొనసాగుతుందని స్టాలిన్ స్పష్టం చేశారు.



# దేశ సమస్యలపై ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలి

- ఎప్పటికప్పుడు స్పందించడం అలవర్చుకోవాలి
- దేశం కోసం సోనం వాంగ్‌చుక్ పోరాటం అభినందనీయం
- ఎక్స్ వేదికగా నటి మంచు లక్ష్మి పోస్ట్

**హైదరాబాద్, జులై 23 :** దేశంలో జరుగుతున్న సామాజిక, ప్రజా సమస్యలపై ప్రతి పౌరుడు బాధ్యతగా స్పందించాలని ప్రముఖ నటి, నిర్మాత మంచు లక్ష్మి పిలుపునిచ్చారు. మనకెందుకులే అనే నిర్లక్ష్య ధోరణిని విడిచిపెట్టి, సమాజంలో జరుగుతున్న అన్యాయాలపై ప్రతి ఒక్కరూ తమ స్వరం వినిపించాలని ఆమె కోరారు. తాజాగా రాజ్యాంగ హక్కుల కోసం ఆందోళన చేస్తున్న ప్రముఖ పర్యావరణవేత్త, సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్కు మద్దతుగా మంచు లక్ష్మి సోషల్ మీడియాలో ఓ వీడియోను విడుదల చేశారు. ఆ వీడియోలో దేశంలో జరుగుతున్న పరిణామాలపై తన అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ, ప్రజల్లో సామాజిక బాధ్యత పెరగాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. దేశంలో కీలకమైన సమస్యలు ఎదురవుతున్నప్పుడు చాలామంది వాటిని తమకు సంబంధం లేని విషయాలుగా భావించి మౌనం పాటిస్తున్నారని అన్నారు. కానీ అలాంటి వైఖరి ప్రజాస్వామ్యానికి మంచిది కాదని ఆమె అభిప్రాయ పడ్డారు. ప్రతి ఒక్కరూ ప్రత్యక్షంగా ఉద్యమాల్లో పాల్గొనాల్సిన అవసరం లేకపోయినా, కనీసం సమస్యలపై మాట్లాడటం, చర్చించడం, సోషల్ మీడియా ద్వారా స్పందించడం కూడా ఒక బాధ్యతాయుతమైన పౌరుడి కర్తవ్యమని పేర్కొన్నారు. సోనమ్ వాంగ్‌చుక్ వంటి వ్యక్తులు ప్రజల హక్కుల కోసం చేస్తున్న పోరాటానికి న్యాయం జరగాలని తాను కోరుకుంటున్నానని మంచు లక్ష్మి తెలిపారు. ఆయన ఆశయాలను తాను గౌరవిస్తున్నానని, సమాజ ప్రయోజనాల కోసం పోరాడే వ్యక్తులకు ప్రతి ఒక్కరూ మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఉందని అన్నారు. అలాగే రాజకీయాలపై విమర్శలు చేయడం కంటే, దేశ భవిష్యత్తు, రాబోయే తరాల సంక్షేమం కోసం బాధ్యతతో స్పందించడం ముఖ్యమని ఆమె పేర్కొన్నారు. దేశంలో జరుగుతున్న పరిణామాలను చూస్తూ నిశ్శబ్దంగా ఉండటం తనను బాధిస్తోందని, సమస్యల పరిష్కారం కోసం ప్రజలంతా చొరవ చూపాలని ఆమె విజ్ఞప్తి చేశారు. మంచు లక్ష్మి విడుదల చేసిన ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆమె సందేశానికి పలువురు నెటిజన్లు మద్దతు తెలుపుతూ, ప్రజా సమస్యలపై అవగాహన పెంచే ప్రయత్నాలను అభినందిస్తున్నారు. సమాజంలో జరుగుతున్న అంశాలపై స్పందించడం ప్రతి పౌరుడి బాధ్యత అని ఆమె చేసిన పిలుపు ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.



## ఎస్ఐఆర్ ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి : జిల్లా గణేష్ నేత

**శేరిలింగంపల్లి, జులై 23(జనం వార్త):** క్షేత్రస్థాయిలో ప్రత్యేక ఓటరు నమోదు (ఎస్ఐఆర్) ప్రక్రియలో బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) ఎదుర్కొంటున్న సమస్యలను కాంగ్రెస్ సీనియర్ నాయకులు జిల్లా గణేష్ నేత ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. శంశిగూడ ఎల్లమ్మ బండ పరిధిలోని పలు కాలనీల్లో బీఎల్ఓలు, బీఎల్ఏలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా గణేష్ నేత మాట్లాడుతూ ప్రతి ఇంటికి అధికారులు తప్పనిసరిగా వెళ్లి ఓటరు నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ఒకవేళ ఇంటి సభ్యులు అందుబాటులో లేకపోతే ఇంటి యజమానులకు ప్రక్రియ గురించి వివరించి, అద్దెదారుల వివరాలు, ఫోన్ నంబర్లు సేకరించాలని తెలిపారు. అలాగే కాలనీ సంక్షేమ సంఘాల అధ్యక్షులతో సమన్వయం చేసుకొని పూర్తి సమాచారం సేకరించాలని సూచించారు. ఓటరు నమోదు ప్రతి పౌరుడి బాధ్యత అని, అర్హులైన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తమ పేరును ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని ఆయన అన్నారు. భవిష్యత్తులో ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందేందుకు కూడా ఓటరు నమోదు ముఖ్యమని పేర్కొన్నారు. ఓటరు నమోదు ప్రక్రియకు సంబంధించి ఎలాంటి సందేహాలు ఉన్నా అధికారులు లేదా కాంగ్రెస్ నాయకులను సంప్రదించాలని, నమోదు ప్రక్రియ ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తయ్యేలా పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. క్షేత్రస్థాయిలో బీఎల్ఓలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే తమ దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని జిల్లా గణేష్ నేత తెలిపారు.



## సీఎం దృష్టికి ఆదివాసీ సమస్యలు

### సమస్యలను పరిష్కరించాలని అధికారులకు ఎమ్మెల్యేకు వినతి

**రంపచోడవరం,జూలై 23(జనంవార్త) :** రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు నేడు పర్యటించనున్నారు. ఈ సందర్భంగా,ఏజెన్సీ ప్రాంత ఆదివాసీల దీర్ఘకాలిక సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లేందుకు వినతిపత్ర సమర్పణకు తగిన సమయం కల్పించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ (ఏఎస్ పి) విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు రంపచోడవరం శాసనసభ్యురాలు,రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ మిరియాల శిరీష దేవి,అలాగే జిల్లా కలెక్టర్, ఆర్డీఓ మరియు డీఎస్పీ కార్యాలయాలలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను నేతృత్వంలోని ప్రతినిధి బృందం మర్యాదపూర్వకంగా వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన వేళ ప్రభుత్వ భద్రతా నిబంధనలకు, ప్రోటోకాల్‌కు సంపూర్ణంగా కట్టుబడి ప్రతినిధి బృందంతో కలిసి తమ ప్రాంత విజ్ఞప్తులను వినతిపత్రం ద్వారా అందించాలనుకుంటున్నట్లు తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలో స్థానిక ఆదివాసి యువత ఉపాధి హక్కుల రక్షణకు జి.ఓ.నెంబర్ 3 స్థానంలో ఒక బలమైన చట్టబద్ధమైన ప్రత్యామ్నాయ పరిష్కారాన్ని చూపడం, గిరిజన భూముల పరిరక్షణకు ఎల్.టి.ఆర్ (1/70) చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయడం,మారుమూల గిరిజన గ్రామాల్లో విద్య, వైద్య సదుపాయాలు కల్పించాలన్నారు. అటవీ హక్కుల (ఫ్ఆర్ఏ) పట్టాల మంజూరు మౌలిక వసతుల కల్పన వంటి ప్రజానుకూల అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తేవడమే తమ ముఖ్య ఉద్దేశమని వివరించారు. కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు,ముఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.



## కారం చల్లి పుస్తెలతాడు ఎత్తుకెళ్లిన దుండగులు

**తిరుమలాయపాలెం, జులై 23:** మండలంలో అర్ధరాత్రి దాటిందంటే చాలు.. వృద్ధ దంపతుల గుండెల్లో వణుకు మొదలవుతోంది. ఒంటరిగా ఉండే వృద్ధులే లక్ష్యంగా, కళ్లలో కారం కొట్టడం, ఎదురుతిరిగితే ప్రాణాలు తీయడమే పనిగా పెట్టుకున్న ఒక ప్రమాదకరమైన దొంగల ముఠా మండలంలో తెగబడుతోంది. మొన్న పిండిప్రోలులో జరిగిన ఘోరకలియం మరువకముందే.. బుధవారం అర్ధరాత్రి బీరోలు గ్రామంలో మరో సంచలన దోపిడీ వెలుగుచూసింది. సినిమా తరహాలో తలపించేలా పక్కా వ్యూహంతో జరిగిన ఈ దాడి మండల ప్రజలను భయాందోళనల్లోకి నెట్టేసింది. పక్కా స్కెచ్.. అర్ధరాత్రి గాఢ నిద్రలో ఉంటారనుకుని బీరోలు గ్రామానికి చెందిన ఆవుల భద్రయ్య, శకుంతల అనే వృద్ధ దంపతులు తమ ఇంట్లో నిద్రిస్తున్నారు. వీరి దైనందిన జీవితాన్ని, ఇంట్లో ఉండే పరిస్థితులను దొంగలు గత కొన్ని రోజులుగా నిశితంగా గమనించారు. బుధవారం అర్ధరాత్రి సరిగ్గా 12 గంటల సమయం.. ఊరంతా గాఢనిద్రలో ఉంది. ఇదే అదనుగా భావించిన దుండగుడు పక్కా ప్లాన్‌తో రంగంలోకి దిగాడు. ఇంటి వెనుక భాగం నుంచి ఎవరికీ అనుమానం రాకుండా చాకచక్యంగా లోపలికి దూరాడు. కళ్లలో కారం.. నిమిషాల్లో దోపిడీవృద్ధ దంపతులు నిద్రిస్తున్న గదిలోకి ప్రవేశించిన దుండగుడు ఒక్కసారిగా వారిపై దాడికి తెగబడ్డాడు. వారు కేకలు వేసే లోపే.. వెంట తెచ్చుకున్న కారాన్ని వారి కళ్లలో చల్లాడు. కళ్ల మంటతో ఆ వృద్ధ దంపతులు విలవిలలాడిపోతుండగా, శకుంతల మెడలో ఉన్న పావు తక్కువ మూడు తులాల బంగారు పుస్తెలతాడును క్షణాల వ్యవధిలో తెంచుకున్నాడు. వృద్ధులు కోలుకునే లోపే చీకట్లోకి వెళ్లిపోయారు .వరుస ఘటనలతో ప్రజలు హడలెత్తిపోతున్నారు. ప్రజలు ప్రతిగటిస్తే ప్రాణాలు తీసేందుకు కూడా వెనుకాడడం లేదు.పిండిప్రోలు ఘటన మరువకముందే బీరోలులో అదే తరహాలో కారం కొట్టి దోపిడీకి పాల్పడడం చూస్తుంటే.. ఇదంతా ఒకే ముఠా పనిగా అనుమానిస్తున్నారు. ఈ వరుస దొంగతనాలు స్థానిక పోలీసుల నిఘా వైఫల్యానికి అద్దం పడుతున్నాయని, రాత్రి వేళల్లో గస్తీ పెంచకపోతే వృద్ధుల ప్రాణాలకు రక్షణ ఉండదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో సంఘటన స్థలాన్ని కూసుమంచి సీఐ సంజీవ్ , ఎస్ ఐ కూచిపూడి జగదీష్ సంఘటన స్థలాన్ని పరిశీలించి బాధితుల ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్ ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినందుకు తెలిపారు.

## గోపీనగర్ అంగన్‌వాడీ వద్ద పొంగిపొర్లుతున్న మురుగు

### అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం

**శేరిలింగంపల్లి, జులై 23 (జనం వార్త):** శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని గోపీనగర్ అంగన్‌వాడీ కేంద్రం సమీపంలో మురుగునీరు పొంగిపొర్లుతుండటంతో స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రానికి ప్రతిరోజూ చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు పెద్ద సంఖ్యలో వస్తుండగా, కేంద్రం పరిసరాల్లో అపరిశుభ్ర వాతావరణం నెలకొనడం వారి ఆరోగ్యానికి ముప్పుగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగునీరు రహదారిపై నిల్వ ఉండటంతో దుర్వాసన వెదజల్లడమే కాకుండా దోమలు, ఈగలు విపరీతంగా పెరిగి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు చెబుతున్నారు. చిన్నారులు మురుగునీటి మధ్యగానే అంగన్‌వాడీకి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని, వర్షాలు కురిసిన ప్రతిసారి సమస్య మరింత తీవ్రమవుతోందని పేర్కొంటున్నారు. ఈ సమస్యపై పలుమార్లు సంబంధిత మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం చూపలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. తాత్కాలిక చర్యలతో సరిపెట్టకుండా మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రం వద్ద నెలకొన్న ఈ పరిస్థితిని వెంటనే పరిశీలించి మురుగునీటి నిల్వను తొలగించడంతో పాటు పారిశుద్ధ్య చర్యలను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని స్థానిక వార్డు ప్రజాప్రతినిధులు,



సంబంధిత మున్సిపల్ అధికారులను కోరుతున్నారు. చిన్నారులు, గర్భిణీలు, బాలింతల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే స్పందించి అవసరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు బుక్స్ పంపిణీ

- 'గిఫ్ట్ ఏ స్మైల్'తో విద్యార్థులు హర్షం
- విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన చేయూత.. బొబ్బ నవత రెడ్డి

**శేరిలింగంపల్లి, జూలై 23 (జనం వార్త) :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 50వ జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న 'గిఫ్ట్ ఏ స్మైల్' కార్యక్రమంలో భాగంగా గురువారం చందానగర్ డివిజన్‌లో మాజీ కార్పొరేటర్,బొబ్బ చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ బొబ్బ నవత రెడ్డి ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు భారీ ఎత్తున విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. సుమారు రూ.3 లక్షల వ్యయంతో 5,000 నోట్‌బుక్స్, 600 పెన్సిల్ బాక్సులు అందజేయడంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఉమ్మడి చందానగర్ డివిజన్ పరిధిలోని ఎంపీపీ ఉర్దూ మీడియం పాఠశాల (వేముకుంట),ఎంపీపీ తెలుగు మీడియం పాఠశాల (వేముకుంట), వేమన వీకర్ సెక్షన్ ఎంపీపీ పాఠశాల, శివాజీనగర్ బస్తీ ఎంపీపీ పాఠశాల, ఇందిరానగర్ బస్తీ ఎంపీపీ పాఠశాలలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.సుమారు 600 మంది విద్యార్థులకు నోట్ బుక్స్‌తో పాటు ఒక్కో పెన్సిల్ బాక్సులో రెండు పెన్నులు, ఒక





పెన్సిల్, స్కేల్, షార్పనర్, రబ్బర్‌ను అందజేశారు. నాణ్యమైన విద్యా సామగ్రి ఉచితంగా అందడంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేయగా, తల్లిదండ్రులు ట్రస్ట్ సేవలను అభినందించారు. ఈ కార్యక్రమాన్ని మాజీ మినిమం వేజ్ బోర్డు చైర్మన్ సామ వెంకట్ రెడ్డి, బొబ్బ నవత రెడ్డి కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాయకుల జన్మదినాలను కేవలం వేడుకలకు పరిమితం చేయకుండా సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాల ద్వారా జరుపుకోవడం నిజమైన వేడుక అని పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ విద్యార్థి చదువుకు దూరం కాకూడదనే లక్ష్యంతో బొబ్బ చారిటబుల్ ట్రస్ట్ నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న పలువురు వక్తలు బొబ్బ చారిటబుల్ ట్రస్ట్ సేవలను ప్రశంసిస్తూ, పేద విద్యార్థులకు అండగా నిలుస్తూ విద్యాభి వృద్ధికి చేస్తున్న కృషి ఇతరులకు ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో విద్య పట్ల మరింత చైతన్యం తీసుకువస్తాయని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమం లో బీఆర్ఎస్ నాయకులు మల్లికార్జున్ శర్మ,రాజన్న,ఎం.డి. సలీం,చందర్ రావు, నగేష్ రెడ్డి,ప్రమోద్, అంజి, శేఖర్, వంశీ రెడ్డి, రామారావు,అనంత రెడ్డి, శభన,సునీత,శ్రీను తదితరులు,ఆయా ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్‌ను పకడ్బందీగా పూర్తి చేయాలి

### శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

### మాజి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్



**శేరిలింగంపల్లి, జూలై 23(జనం వార్త):** సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే--ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ప్రక్రియను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ బూత్ ఇంచార్జ్‌లకు సూచించారు. గురువారం శేరిలింగంపల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బూత్ ఇంచార్జ్‌లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. జగదీశ్వర్



గౌడ్, కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్‌తో పాటు పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఇంటిని సందర్శించి ఒక్క కుటుంబం కూడా మిస్ కాకుండా పూర్తి వివరాలు నమోదు చేయాలని సూచించారు. సర్వే ద్వారా సేకరించే సమాచారం ఆధారంగానే భవిష్యత్తులో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు జరుగుతుందని, అందువల్ల ప్రతి బూత్ ఇంచార్జ్ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని కోరారు. కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ మాట్లాడుతూ శేరిలింగంపల్లి డివిజన్‌లోని అన్ని బూత్‌లలో ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ప్రక్రియ సజావుగా జరిగేలా తమ వంతు సహకారం అందిస్తున్నామని తెలిపారు. ప్రజలు సర్వే సిబ్బందికి సహకరించి తమ వివరాలను సక్రమంగా నమోదు చేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో డివిజన్ ముఖ్య నాయకులు, బూత్ ఇంచార్జ్‌లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటికీ చెట్టును ప్రారంభించిన సర్పంచ్

**నిజామాబాద్,జూలై23 :** నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండలం కొత్తపల్లి గ్రామంలో పచ్చదనం పెంపు లక్ష్యంగా గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో 'ఇంటింటికీ చెట్టు' కార్యక్రమాన్ని సర్పంచ్ విజయకృష్ణారెడ్డి ప్రారం భించారు. ఈ సందర్భంగా తొలి మొక్కను స్వయంగా నాటి, ప్రతి ఇంటి వద్ద ఒక చెట్టును పెంచే బాధ్యత తీసుకోవాలని గ్రామస్తులకు పిలుపునిచ్చారు. వాతావరణ మార్పులు, పెరుగుతున్న ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకుని కొత్తపల్లిని హరిత గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని తెలిపారు. నేరేడు, వేప, మామిడి, చింత, రావి వంటి నీడనిచ్చే, ఔషధ గుణా లున్న మొక్కలను గ్రామస్తులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రతి కుటుంబం ఒక మొక్కను దత్తత తీసుకుని సంరక్షించాలని సూచించారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని పెంచి పెద్ద చేయడమే నిజమైన బాధ్యత అని అన్నారు. గ్రామంలోని పార్కులు, రహదారుల వెంట, ప్రభుత్వ స్థలాల్లో కూడా విస్తృతంగా మొక్కలు నాటి వాటికి రక్షణ కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కొండపల్లి-మోటమర్రి రైల్వే సెక్షన్ విభజనకు అభ్యంతరం

### ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి తీవ్ర వ్యతిరేకత



**న్యూఢిల్లీ, జూలై 23 :** కొండపల్లి--మోటమర్రి రైల్వే సెక్షన్‌తో పాటు మధిర రైల్వే స్టేషన్‌ను దక్షిణ మధ్య రైల్వే నుంచి విశాఖపట్నం కేంద్రంగా ఉన్న దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు బదిలీ చేయాలన్న ప్రతిపాదనను ఖమ్మం లోక్‌సభ సభ్యుడు రామసహాయం రఘురాం రెడ్డి తీవ్రంగా వ్యతిరేకించారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల సందర్భంగా గురువారం లోక్‌సభలో 377 నిబంధన కింద ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. మధిర రైల్వే స్టేషన్ ప్రస్తుతం సికింద్రాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న దక్షిణ మధ్య రైల్వే పరిధిలో ఉండటంతో మెరుగైన రవాణా సౌకర్యాలు, మౌలిక వసతులు, సమయపాలన, ముఖ్యమైన ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టింగ్‌ల వంటి అనేక ప్రయోజనాలు కలుగుతున్నాయని ఎంపీ పేర్కొన్నారు. ప్రయాణికుల సమస్యల పరిష్కారంలో ఎస్సీఆర్ అధికారులు సమర్థవంతంగా పనిచేస్తున్నారని తెలిపారు. విశాఖపట్నం కేంద్రంగా ఉన్న దక్షిణ కోస్తా రైల్వే పరిధిలోకి ఈ సెక్షన్‌ను మార్చితే పరిపాలనా జాప్యం, స్థానిక అవసరాలపై నిర్లక్ష్యం, తెలంగాణకు సంబంధించిన వనరులు ఇతర ప్రాంతాలకు మళ్లే అవకాశం ఉందనే ఆందోళన ప్రజల్లో నెలకొందని ఆయన అన్నారు. ఈ బదిలీ వల్ల దక్షిణ మధ్య రైల్వే ఉనికి క్రమంగా బలహీనపడటంతో పాటు హైదరాబాద్, ఖమ్మం, విజయవాడ తదితర ప్రాంతాలకు నిత్యం ప్రయాణించే వేలాది మంది ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని ఎంపీ వివరించారు. ఈ నేపథ్యంలో కొండపల్లి--మోటమర్రి రైల్వే సెక్షన్‌ను ఎస్సీఓఆర్‌కు బదిలీ చేసే ప్రతిపాదనను కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ వెంటనే ఉపసంహరించుకోవాలని రఘురాం రెడ్డి డిమాండ్ చేశారు. మధిర, మోటమర్రి, ఎర్రుపాలెం రైల్వే స్టేషన్లతో పాటు ఖమ్మం జిల్లా పరిధిలోని రైల్వే మార్గాన్ని దక్షిణ మధ్య రైల్వే (రాజ=) పరిధిలోనే కొనసాగించి ప్రాంతీయ ప్రయోజనాలను కాపాడాలని, ప్రయాణికులకు మెరుగైన రైలు సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని కోరారు.



## మరణించిన కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే కందాళ పరామర్శ

**కూసుమంచి, జులై 23:** పాలేరు మాజీ ఎమ్మెల్యే శ్రీ కందాళ ఉపేందర్ రెడ్డి కూసుమంచి మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల మరణించిన వారి కుటుంబాలను పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. జీళ్ళచెర్వుకు చెందిన బాలబోయిన సత్యం కుటుంబం, చేగొమ్మ గ్రామానికి చెందిన కుక్క సాయమ్మ కుటుంబం, కూసుమంచికి చెందిన కందుల కోటయ్య కుటుంబం, బండారుపల్లికి చెందిన కాంతయ్య కుటుంబం, రాజుపేట బజార్‌కు చెందిన మండవ రాములు, నందిరెడ్డి చిన్న కోటి రెడ్డి కుటుంబాలు, ఈశ్వరమాదారానికి చెందిన అమరగాని వీరస్వామి, ఎస్కే జానిమియా, ఇరుగు వెంకన్న కుటుంబాలను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. అనంతరం కూసుమంచికి చెందిన బెల్లంకొండ నాగన్న, గుండా మోహన్ రెడ్డి, రాజుపేటకు చెందిన తూముల నాగమ్మ అనారోగ్యంతో బాధపడుతున్న నేపథ్యంలో వారిని కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.



## విద్యార్థులపై ఢిల్లీ పోలీసుల లాఠీచార్జ్‌ను తీవ్రంగా ఖండించిన పీడీఎస్‌యూ

### విద్యార్థులపై నమోదైన కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్

**కారేపల్లి, జులై 23:** ఢిల్లీలో విద్యార్థులపై పోలీసులు జరిపిన లాఠీచార్జ్‌ను ఖండిస్తూ, విద్యార్థులపై నమోదైన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ కారేపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి కారేపల్లి సెంటర్ వరకు భారీ విద్యార్థి ర్యాలీ నిర్వహించారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు జి. మస్తాన్, పీఓడబ్ల్యూ (గూఔ) జిల్లా కార్యదర్శి వై. జానకి పాల్గొని మాట్లాడారు. ఉన్నత విద్యలో నెలకొన్న అవినీతి, పరీక్షల నిర్వహణలో అక్రమాలు, విద్యా వ్యవస్థలో పెరుగుతున్న సంక్షోభానికి కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ అంశాలపై సీజేపీ (జజీూ) ఆధ్వర్యంలో ఢిల్లీలో నిర్వహించిన శాంతియుత ధర్నాపై పోలీసులు లాఠీచార్జ్ చేయడం దుర్మార్గమని విమర్శించారు. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేయడం ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధమైన హక్కు అని, ఆ హక్కును అణచివేయడానికి పోలీసు బలగాలను ప్రయోగించడం ప్రజాస్వామ్య వ్యతిరేక చర్య అని పేర్కొన్నారు. విద్యార్థులు లేవనెత్తుతున్న సమస్యలకు సమాధానం చెప్పకుండా వారిపై లాఠీచార్జ్ చేయడం కేంద్ర ప్రభుత్వ వైఖరిని బహిర్గతం చేసిందన్నారు. విద్యా సమస్యలు, పరీక్షల నిర్వహణలో అక్రమాలు వంటి అంశాలను పరిష్కరించకుండా నిరసనలను అణచివేయడం ద్వారా కేంద్ర ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్‌పై న్యాయ విచారణ జరిపించాలని, అరెస్టు చేసిన విద్యార్థులు, యువతను వెంటనే బేషరతుగా విడుదల చేయాలని, వారిపై నమోదైన అన్ని కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. శాంతియుత నిరసన తెలిపే రాజ్యాంగ హక్కును పరిరక్షించాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని కోరారు. డిమాండ్లు నెరవేర్చకపోతే పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షుడు గాంధీ, జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేష్, కారేపల్లి మండల కార్యదర్శి సంజయ్, చందు, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

# 100 నగరాలకు బీపీసీఎల్ 10కేజీల ఎల్‌పీజీ సిలిండర్లు




ప్రభుత్వరంగ చమురు సంస్థ భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ తన 10 కేజీల ఎల్‌పీజీ సిలిండర్ల సేవలను మరిన్ని నగరాలకు విస్తరించనుంది. ఆగస్టు 15 నాటికి 24 రాష్ట్రాల్లోని 100 నగరాల్లో ఈ సిలిండర్లను అందుబాటులో తేనుంది. తొలి త్రైమాసిక ఫలితాల అనంతరం నిర్వహించిన ఎర్నింగ్స్ కాన్ఫరెన్స్‌లో సంస్థ ఈ విషయాన్ని వెల్లడించింది. ఎల్‌పీజీ కనెక్షన్‌ను తక్షణమే అందించడంతో పాటు గ్యాస్ సిలిండర్‌ను త్వరితగతిన డెలివరీ చేసే విధంగా భారత్ గ్యాస్ ఇటీవల 'లైట్ జిప్' పేరిట ప్రీమియం ఎల్‌పీజీ సర్వీసును ప్రారంభించింది. తక్కువ బరువు కలిగి, తుప్పుపట్టకుండా ఉండేలా ఈ సిలిండర్లను రూపొందించారు. ఈ సిలిండర్లను తరలించడం కూడా సులువు. మరో ప్రభుత్వరంగ సంస్థ హెచ్‌పీసీఎల్ ఇటీవల 'నవ్య' పేరిట 10 కేజీ సిలిండర్ సేవలను లాంచ్ చేసింది. ఈ నేపథ్యంలో బీపీసీఎల్ కూడా ఎక్స్‌ప్రెస్ డెలివరీ సేవలకు శ్రీకారం చుట్టింది. ఆగస్టు 15 నాటికి 100 నగరాలకు విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకుంది.



# బిజినెస్



## నష్టాలతో ముగిసిన సూచీలు

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాలతో ముగిశాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, క్రూడాయిల్ ధరలు పెరగడం మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. ముఖ్యంగా ఫార్మా, ఐటీ, బ్యాంకింగ్ స్టాక్స్ అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి. దీంతో వరుసగా నాలుగో రోజూ మార్కెట్ సూచీలు నష్టాల బాటపట్టాయి. మదుపర్ల సంపదగా భావించే బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.3 లక్షల కోట్లు క్షీణించి రూ.477 లక్షల కోట్లకు చేరింది. ఉదయం సెన్సెక్స్ 76,515.10 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 76,755.05) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా సూచీ నష్టాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 76,151.98 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరికి సెన్సెక్స్ 363.66 పాయింట్లు కోల్పోయి 76,391.39 వద్ద ముగిసింది. నిఫ్టీ 126.65 పాయింట్లు పతనమై 23,869.60 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 96.57గా ఉంది. సెన్సెక్స్ 30లో ఆదానీ పోర్ట్స్, బజాజ్ ఫైనాన్స్, ఇండిగో, యాక్సిస్ బ్యాంక్, రిలయన్స్, టాటాస్టీల్ షేర్లు ప్రధానంగా నష్టాలను చవిచూశాయి. మహీంద్రా అండ్ మహీంద్రా, టీసీఎస్, ఎటర్నల్, హెచ్‌సీఎల్, బజాజ్ ఫిన్‌సర్వ్, కోటక్ బ్యాంక్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్‌క్రూడ్ 97.95 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్సు 4,088.87 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.




## వాట్సప్ కొత్త ఫీచర్లు

**ప్రముఖ మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ వాట్సప్ సరికొత్త ఫీచర్లను తీసుకొచ్చింది. వాట్సప్‌లోనే పీడీఎఫ్ ఎడిట్, మ్యూజిక్ ప్లాట్‌ఫామ్స్‌ను నేరుగా స్టేటస్, ఐప్యాడ్‌లోనూ వాట్సప్‌ను వినియోగించుకునేలా కొత్త సదుపాయాలు తీసుకొచ్చింది. వినియోగదారుల అవసరాలకు తగ్గట్టు యాప్‌ను తీర్చిదిద్దడంలో భాగంగా మెటా ఈ కొత్త ఫీచర్లను లాంచ్ చేసింది.**

- వాట్సప్ తీసుకొచ్చిన ఫీచర్లలో ముఖ్యమైనది పీడీఎఫ్ ఎడిట్. ఇప్పటి వరక
- ఐప్యాడ్ యూజర్లకు వాట్సప్‌ను మెటా మరింత చేరువ చేసింది. ఇంతకుముందు ప్రైమరీ డివైజ్‌గా స్మార్ట్‌ఫోన్ ఉండేది. ఐప్యాడ్‌లో వాట్సప్‌కు లింక్ చేసుకునే ఆప్షన్ మాత్రమే ఇచ్చారు. ఇకపై ఐప్యాడ్‌ను వాట్సప్ ప్రైమరీ డివైజ్‌గా వినియోగించుకోవచ్చు. అంటే నేరుగా ఐప్యాడ్‌లోనే వాట్సప్‌ను లాగిన్ అవ్వొచ్చన్నమాట. అకౌంట్ కూడా క్రియేట్ చేయొచ్చు.
- యాపిల్ మ్యూజిక్, స్పాటిఫై వంటి మ్యూజిక్ ప్లాట్‌ఫాంలో మనకు నచ్చిన పాటలను ఇకపై వాట్సప్ స్టేటస్‌లో షేర్ చేయొచ్చు.
- కార్‌ప్లే, ఆండ్రాయిడ్ ఆటోప్లే వినియోగదారులు కూడా ఇకపై వాట్సప్‌ను నేరుగా సెట్ చేసుకోవచ్చు. స్మార్ట్‌ఫోన్ అవసరం లేకుండానే మెసేజ్‌లు చేయడం, కాల్స్ మాట్లాడటం, కాల్ హిస్టరీ చూడటం వంటి సదుపాయాలను వినియోగించుకోవచ్చు. ఈ కొత్త ఫీచర్లను ఇప్పటికే రోల్ అవుట్ చేసినట్లు మెటా తన బ్లాగ్ పోస్టులో పేర్కొంది. దశలవారీగా యూజర్లందరికీ అందుబాటులోకి రానున్నాయి.







# వైభవ్ మెరుపులు

## జింబాబ్వేపై తొలి టీ20లో భారత్ విజయం

**హరారే:** వరుసగా రెండో టీ20 ప్రపంచకప్ గెలిచాక ఆడిన రెండు సిరీస్‌ల్లోనూ వైట్‌వాష్‌కు గురైన టీమ్‌ఇండియా.. ఎట్టకేలకు గెలుపు రుచి చూసింది. జింబాబ్వేతో మూడు టీ20ల సిరీస్‌లో భాగంగా గురువారం జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ ఏడు వికెట్ల తేడాతో విజయం సాధించింది. భారత టీ20 సారథిగా ఏడు మ్యాచ్‌ల తర్వాత శ్రేయస్ అయ్యర్ తొలి విజయం అందుకున్నాడు. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన జింబాబ్వే నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 125 పరుగులు చేసింది. ఈ లక్ష్యాన్ని టీమ్‌ఇండియా 13.2 ఓవర్లలోనే 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. వైభవ్ సూర్యవంశీ (50; 19 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) చెలరేగాడు. ఇషాన్ కిషన్ (35; 24 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), శ్రేయస్ అయ్యర్ (28; 24 బంతుల్లో 3 ఫోర్లు) పరుగులు చేశారు. మయాంక్ యాదవ్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. రెండో టీ20 శనివారం జరగనుంది. తొలుత జింబాబ్వే టాప్-4 బ్యాటర్లు బ్రయాన్ బెనెట్ (0), బెన్ కర్రాన్ (10), డియోన్ మైయర్స్ (6), సికిందర్ రజా (4) త్వరగానే పెవిలియన్ చేరారు. దీంతో ఆ జట్టు 32 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయింది. తర్వాత వచ్చిన వెస్లీ మద్వీర (39), మరుమాని (27లి), ర్యాన్ బర్ల్ (26) జట్టును ఆదుకున్నారు. మరుమాని, మద్వీర ఆరో వికెట్‌కు 37 బంతుల్లో 57 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. భారత బౌలర్లలో మయాంక్ యాదవ్ 2, ప్రిన్స్ యాదవ్ 2, శివమ్ దూబె, రవి బిష్ణోయ్ ఒక్కో వికెట్ పడగొట్టారు.



## చైనా ఓపెన్‌లో పీవీ సింధు ఓటమి

చైనా ఓపెన్‌లో భారత స్టార్ షట్లర్, తెలుగుతేజం పీవీ సింధు పోరాటం ముగిసింది. ప్రిక్వార్టర్స్‌లో చెన్ యుఫీయ్ (చైనా) చేతిలో 16-21, 22-20, 21-18 తేడాతో ఆమె ఓడిపోయింది. ఇటీవలే జపాన్ ఓపెన్‌ను సింధు గెలుచుకున్న సంగతి తెలిసిందే. సెమీస్‌లో యుఫీయ్‌పైనే భారత షట్లర్ గెలిచి ఫైనల్‌కు వెళ్లింది. ఇప్పుడు కూడా చివరి వరకూ సింధు పోరాడినా ఓటమి తప్పలేదు. దాదాపు గంటన్నరపాటు హోరాహోరీగా సాగిన పోరులో తొలి గేమ్ పీవీ సింధుదే. 21-16 తేడాతో విజయం సాధించింది. ఇక రెండో గేమ్‌లోనూ అదే దూకుడు ప్రదర్శించింది. కానీ, ఆఖర్లో పుంజుకున్న యుఫీయ్ 22-20 తేడాతో సింధుపై గెలిచి స్కోరును సమం (1-1) చేసింది. ఇక నిర్ణయాత్మక చివరి గేమ్‌లోనూ తీవ్ర పోటీ తప్పలేదు. పాయింట్ల కోసం ఇరువురూ శ్రమించారు. చివరికి 21-18 తేడాతో సింధుపై గెలిచిన యుఫీయ్ క్వార్టర్స్‌కు దూసుకెళ్లింది.

# ఎప్పుడూ షార్ట్‌కట్‌లను అనుసరించవద్దు

## విద్యార్థుల ఆందోళనల వేళ సచిన్ ఆసక్తికర పోస్టు





నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో బాధ్యులపై చర్యలు తీసుకోవడంతోపాటు విద్యావ్యవస్థలో సంస్కరణలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా విద్యార్థులు ఆందోళన చేస్తున్న వేళ క్రికెట్ దిగ్గజం సచిన్ 'ఎక్స్'లో ఓ ఆసక్తికర పోస్టు పెట్టారు. "మా నాన్నగారు ప్రొఫెసర్. ఆయన ఎంతో మంది యువ విద్యార్థులకు మార్గదర్శిగా ఉండేవారు. 'ఫెయిల్యూర్ ఓకే.. ఛీటింగ్ కాదు.. ఎప్పుడూ షార్ట్‌కట్‌లను అనుసరించవద్దు' అని నా చిన్నతనంలోనే చెప్పారు. సమాజంలో పెద్దలుగా సంస్కృతిని తీర్చిదిద్దే బాధ్యత మనపై ఉంది. శ్రమ కంటే ఫలితాలకే ఎక్కువ ప్రాధాన్యతనిచ్చే సమాజం.. ప్రతిభకు బదులుగా అడ్డదారులను వెతుకుతుంది. ఈ రోజుల్లో విద్యార్థులు తమ కష్టానికి తగిన ప్రతిఫలం లభించలేదని నిరాశ చెందితే.. అది అర్థం చేసుకోదగినదే. కాకపోతే, వారు మళ్లీ ఇలాంటి భావనకు గురికాకుండా చూసేందుకు మనమందరం కలిసికట్టుగా కృషి చేయాలి. కష్టానికి తగిన ప్రతిఫలం లభించేలా, ప్రతిభకు పట్టం కట్టే సంస్కృతిని సృష్టించాలి. మన పిల్లల భవిష్యత్తును బలోపేతం చేసి వారి ఆకాంక్షలను కాపాడే పరిష్కారాలను మనమందరం కనుగొంటామని నాకు నమ్మకం ఉంది. జై హింద్!" అని ఎక్స్‌లో రాసుకొచ్చారు.




## భగ్గుమన్న చమురు ధరలు..

### మళ్లీ 100 డాలర్ల దిశగా క్రూడ్

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు నానాటికీ తీవ్రమవుతుండటంతో అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు మళ్లీ ఆకాశన్నంటుతున్నాయి. బ్రెంట్ క్రూడ్ ఆరు వారాల గరిష్ఠానికి చేరింది. గురువారం ఉదయం బ్యారెల్ ధర 1.5శాతానికి పైగా పెరిగి 95 డాలర్లు దాటి ట్రేడ్ అవుతోంది. ఇక, వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియెట్ క్రూడ్ బ్యారెల్ ధర 88 డాలర్ల వద్ద కొనసాగుతోంది. ఈ ఒక్క నెలలో బ్రెంట్ క్రూడ్ ధర ఇప్పటివరకు దాదాపు 30శాతం పెరగడం గమనార్హం. ఉద్రిక్తతలు ఇలాగే కొనసాగితే చమురు మంటలు మరింత పెరుగుతాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. అమెరికా-ఇరాన్ పరస్పర దాడులతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ఇప్పట్లో తగ్గేలా కన్పించట్లేదు. ఈ పరిణామాలతో హర్మూజ్‌లో నౌకల రవాణా మళ్లీ నెమ్మదించింది. మరోవైపు, ఎర్ర సముద్రంలో సౌదీ అరేబియాకు చెందిన రెండు చమురు ట్యాకర్లపై హూతీలు దాడులు చేశారు. దీంతో అంతర్జాతీయంగా చమురు సరఫరాకు అంతరాయం వాటిల్లుతుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ చమురు మంటలు, అంతర్జాతీయ పరిణామాలతో దేశీయంగా స్టాక్ మార్కెట్లు గురువారం కూడా నష్టాల్లో కొనసాగుతున్నాయి. ఉదయం 9.40 గంటల సమయంలో సెన్సెక్స్ 300 పాయింట్లు తగ్గి 76,454 వద్ద ట్రేడ్ అవుతోంది. నిఫ్టీ 83 పాయింట్ల నష్టంతో 23,913 వద్ద కొనసాగుతోంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 5 పైసలు పెరిగి 96.48గా ట్రేడ్ అవుతోంది.

జనం వార్త

## 'జన నాయగన్' థియేటర్‌లో నటి త్రిష సందడి



తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ నటించిన జయ నాయగన్ సినిమా ఎట్టకేలకు రిలీజ్ అయింది. మొన్నటి సంక్రాంతి కానుకగా ఈ సినిమా రిలీజ్ కానుండగా.. అనేక రకాల కారణాల వల్ల వాయిదా పడుతూ వచ్చింది. కానీ విజయ్ ముఖ్యమంత్రి అయిన తర్వాత ఈ సినిమా రిలీజ్ కు ఉన్న అడ్డంకులు అన్ని తొలగిపోయాయి. ఈ క్రమంలో గురువారం సినిమా రిలీజ్ అయి.. సక్సెస్ ఫుల్ గా దూసుకు వెళ్తోంది. ఈ క్రమంలో ఈ సినిమాను చూసేందుకు హీరోయిన్ త్రిష థియేటర్ కు రావడం ఇప్పుడు హాట్ టాపిక్ అయింది. చెన్నైలోని రోహిణి థియేటర్ కు వెళ్లిన ఆమె... మూవీని వీక్షించారు. అయితే ఈ థియేటర్ కు ఆమె వెళ్లగానే అక్కడ ఉన్న అభిమానులు రచ్చ చేశారు. త్రిష.. త్రిష అంటూ నినాదాలు చేసి సందడి చేశారు. సినిమా చూసిన తర్వాత ఎలాంటి కామెంట్ చేయకుండా... కారెక్కి త్రిష వెళ్లిపోయారు. అయితే గత కొన్ని రోజులుగా సీఎం విజయ్, హీరోయిన్ త్రిష మధ్య ఏదో ఉందని జోరుగా ప్రచారం తాగుతోంది. ఈ నేపథ్యంలోనే త్రిష ఎక్కడికి వెళ్ళినా తమిళనాడులో హడావిడి కనిపిస్తోంది. కాగా ఇప్పటికే త్రిష, విజయ్ కాంబినేషన్ లో చాలా సినిమాలు వచ్చాయి. ఆయన నటించిన గోట్ సినిమాలో కూడా స్పెషల్ రోల్ చేసి ఈ సందడి చేసింది.

## టాక్సిక్ భిన్నమైన చిత్రం

కేజీఎఫ్ సిరీస్‌తో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన రాక్ స్టార్ యశ్ నటిస్తున్న తాజా పాన్ ఇండియా చిత్రం 'టాక్సిక్: చిత్రం ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఇటీవల విడుదలైన టీజర్, ప్రోమో వీడియోలు, పాటల్లో కనిపించిన బోల్డ్ కంటెంట్ సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారితీసింది. ఈ నేపథ్యంలో చిత్ర నిర్మాత కె. వెంకట నారాయణ తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో సినిమాపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. టాక్సిక్ సాధారణ కమర్షియల్ సినిమా కాదని, తాము ఇప్పటివరకు నిర్మించిన చిత్రాల కంటే పూర్తిగా భిన్నమైన కథాంశంతో రూపొందించామని ఆయన తెలిపారు. ప్రేక్షకులు థియేటర్లలో ఈ సినిమాను చూసిన తర్వాత తప్పకుండా కొత్త అనుభూతిని పొందుతారని, సినిమా ముగిసిన తర్వాత చిత్ర బృందాన్ని అభినందిస్తారనే పూర్తి నమ్మకం తనకు ఉందని పేర్కొన్నారు. అంతేకాకుండా, 'టాక్సిక్' ఒక కల్పిత కథ ఆధారంగా రూపొందిన సినిమా అని, ముఖ్యంగా పెద్దల కోసం రూపొందించిన ప్రత్యేక కథనమని ఆయన స్పష్టం చేశారు. సినిమా టైటిల్‌కు తగ్గట్టుగానే ఇందులో భావోద్వేగాలు, యాక్షన్, రొమాన్స్ ప్రేక్షకులను ఆకట్టుకునే అంశాలు ఉంటాయని సంకేతాలు ఇచ్చారు. ఇటీవల విడుదలైన 'మనసాగదే' పాటకు అద్భుతమైన స్పందన లభిస్తోంది. యశ్, తారా సుతారియా మధ్య సాగే ఈ రొమాంటిక్ ట్రాక్ సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో నిలిచింది. ముఖ్యంగా పాటలోని విజువల్స్, సంగీతం, ఇద్దరి కెమిస్ట్రీ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ఈ పాటపై హీరోయిన్ తారా సుతారియా కూడా స్పందించారు. పాటలోని కొన్ని సన్నివేశాలను ఎంతో అందంగా చిత్రీకరించారని, చిత్రబృందం విజువల్‌గా అద్భుతమైన అనుభూతిని అందించిందని ఆమె సోషల్ మీడియా ద్వారా పేర్కొన్నారు. దీంతో ఈ పాటకు మరింత క్రేజ్ ఏర్పడింది. భారీ తారాగణంతో రూపొందుతున్న ఈ చిత్రంలో నయనతార, కియారా అద్వానీ, రుక్మిణి వసంత్, హ్యూమా ఖురేషీ, తారా సుతారియా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. భారీ బ్జడెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా పలు భాషల్లో విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.



# జన నాయకుడు.. అక్కడక్కడా మెప్పిస్తాడు!

**రివ్యూ**

దళపతి వెట్రి కొండాన్ (విజయ్) ఓ ఖైదీగా జైలు జీవితాన్ని గడుపుతుంటాడు. ఓ వ్యాపారవేత్తని అంతం చేయడానికి జైలుపై పడిన ముఠాని ఎదురించి నిజాయతీ కలిగిన జైలు అధికారి (గౌతమ్ మేనన్) దృష్టిని ఆకర్షిస్తాడు. ఆ అధికారి సాయంతో ఆగస్టు 15న క్షమాభిక్ష కింద బయటకొస్తాడు వెట్రి. అంతలోనే ఆ అధికారి ఓ ప్రమాదంలో మరణిస్తాడు. దాంతో అతని కుమార్తె విజ్జి (మమిత బైజు)ని పెంచే బాధ్యతని వెట్రి తన భుజాన వేసుకుంటాడు. చిన్నప్పుడు తల్లి దారుణ హత్యని కళ్లారా చూసిన విజ్జి ప్రతి చిన్న విషయానికీ భయంతో వణికిపోతుంటుంది. ఆమెను ధైర్యవంతురాలిగా మార్చి, సైన్యంలో చేర్పించాలని నిర్ణయించుకుంటాడు. అందుకోసం శిక్షణ కూడా ఇప్పిస్తుంటాడు. ఇంతలో జాన్ హిమ్లర్ (బాబీ దేవోల్) విజ్జిని లక్ష్యంగా చేసుకుని ఆమెని అంతం చేయాలని తన ముఠాని పంపుతాడు.



ఇంతకీ విజ్జిని జాన్ హిమ్లర్ లక్ష్యంగా చేసుకోవడానికి కారణమేమిటి?ఆఫ్రికా దేశాల్ని కూడా వణికించిన జాన్ హిమ్లర్ ఎవరు? అతన్ని వెట్రి కొండాన్ ఎలా ఎదిరించాడు?విజ్జిలోని భయాన్ని పోగొట్టి ఆమెని ధైర్యవంతురాలిగా మార్చాడా?లేదా? ఎమ్.ఎమ్ పేరుతో భారతదేశంలో విద్వేషాల్ని రగిలించడానికి పథకం వేసిన జాన్ హిమ్లర్ అసలు లక్ష్యమేమిటి? ఆయనకీ రాజకీయ నాయకుడు రోజా రంగస్వామి (ప్రకాశ్‌రాజ్)కీ మధ్య సంబంధం ఏమిటి? తదితర విషయాల్ని తెరపై చూసి తెలుసుకోవాల్సిందే.

### ఎలా ఉందంటే..

తెలుగులో విజయంతమైన 'భగవంత్ కేసరి' స్ఫూర్తితో రూపొందిన చిత్రమిది. ఇది మక్కీకి మక్కీ రీమేక్ కానప్పటికీ... ఆ కథలోని ఆత్మ, పాత్రలు పక్కాగా కనిపిస్తాయి. దాంతో తెలుగు ప్రేక్షకులకు అడుగడుగునా 'భగవంత్ కేసరి' సినిమానే గుర్తొస్తుంది. అయితే 'బేటీ బచావో... బేటీ పడావో' నినాదం ఆధారంగా రూపొందిన మాతృకలోని ఆత్మ, భావోద్వేగాలు ఈ సినిమాలోకి ఆశించిన స్థాయిలో బదిలీ కాలేదు. విజయ్ రాజకీయ అజెండా, మితిమీరిన వాణిజ్యాంశాల మధ్య కథలోని అసలు ఆత్మ నలిగిపోయింది. తమిళనాడు ఎన్నికలకు ముందు రూపొందిన ఈ సినిమా విజయ్ రాజకీయ ఆలోచనల్ని, అజెండాని మాత్రం పక్కాగా తెరపై ఆవిష్కరించింది. ఆయనకు రాజకీయంగా లబ్ధి చేకూర్చే విషయాలు సినిమాలో అడుగడుగునా కనిపిస్తాయి. ముందు అనుకున్నట్టుగా ఈ సినిమా ఎన్నికలకు ముందు విడుదలై ఉంటే విజయ్ పార్టీకి మరింత మెజారిటీ రావడానికి కారణమయ్యేదేమో. వారసత్వ రాజకీయాలు, మత రాజకీయాల్ని లక్ష్యంగా చేసుకుని పలు సన్నివేశాల్ని తీర్చిదిద్దారు. ద్వితీయార్ధంలో సింహభాగం అవే సన్నివేశాలే. విజయ్ రాజకీయ శత్రువుల్ని దృష్టిలో ఉంచుకునే ఆ ఎపిసోడ్స్ అనే విషయం ఎవ్వరికైనా సులభంగా అర్థమవుతుంది. ఓ సన్నివేశంలో తమ్ముడూ... అంటూ విజయ్ చేతికి చెర్నాకోల అందిస్తారు ఎంజీఆర్. శత్రువుల భరతం పట్టు అన్నట్టుగా! అవన్నీ విజయ్ స్థాపించిన టీవీకే పార్టీ కార్యకర్త లకూ, ఆయన అభిమానులకూ నచ్చే విషయాలే. ఎన్నికల నేపథ్యంలోనే మొదలయ్యే ఈ సినిమా అసలు లక్ష్యమేమిటో తొలి సన్నివేశంతోనే ప్రేక్షకుడికి బోధపడుతుంది. జైలులో పోరాటం, ఆ తర్వాత విజ్జి పాత్రని, ఆమెలోని భయాన్ని పరిచయం చేయడం తదితర సన్నివేశాలన్నీ పక్కాగా మాతృకని అనుసరిస్తాయి. అయితే అవన్నీ కూడా తెలుగులో భావోద్వేగాల్ని, డ్రామాని పంచుతూ ముందుకు సాగుతుంటాయి. 'జన నాయకుడు' సినిమా లక్ష్యమే వేరు కావడంతో అందుకు తగ్గట్టుగా ఉగ్రవాద కోణం, ప్రజాస్వామ్యం అంటూ కథకు మరో రకమైన పునాదులు వేసుకుంటూ వచ్చారు దర్శకుడు. ఆ క్రమంలో సినిమా పరిధిని కూడా పెంచారు. ఆఫ్రికాలో విలన్ సృష్టించే అలజడితో మొదలై ఆ తర్వాత భారత్‌కు చేరుతుంది కథ. విలన్‌ని కలుగులో నుంచి బయటకు రప్పించేందుకూ, అతని మిషన్‌ని బయట పెట్టేందుకు కథానాయకుడు వేసే ఎత్తులు ఈ సినిమాలో ఆసక్తికరం. ఈ క్రమంలో అసలు కథ మరుగున పడిపోతున్నట్టుగా అనిపిస్తుంటుంది. అలాగని కథనేమీ పూర్తిగా పక్కన పెట్టలేదు కానీ, దాని తాలూకు ప్రభావం తగ్గిపోతూ వస్తుంది. ద్వితీయార్ధంలో సింహభాగం రాజకీయ డ్రామానే ఉండటంతో మాతృక స్థాయిలో ప్రధాన పాత్రల మధ్య భావోద్వేగాలు పండలేదు. గుడ్ టచ్ బ్యాడ్ టచ్ నేపథ్యంలో తెలుగులో రూపొందించిన సన్నివేశాలు సినిమాకి ప్రధానబలం. అయితే 'జన నాయకుడు'లో ఆ సన్నివేశాలు అంత ప్రభావం చూపించవు. విజ్జి పాత్రలో చోటు చేసుకునే మార్పు మాత్రం తెలుగుకు దీటుగానే తమిళంలో రూపొందింది. మొత్తంగా ఈ సినిమా విజయ్ అభిమానుల్ని తప్పకుండా అలరిస్తుంది.

## రణ్‌వీర్ ప్రళయ్‌లో దక్షిణాది బ్యూటీ కళ్యాణి ప్రియదర్శన్?

బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్ నటిస్తున్న భారీ బ్జడెట్ చిత్రం 'ప్రళయ్'పై ఇప్పటికే సినీ వర్గాల్లో మంచి అంచనాలు నెలకొన్నాయి. తాజా వార్త ఇప్పుడు మరింత ఆసక్తిని పెంచుతోంది. ఈ చిత్రంలో హీరోయిన్‌గా దక్షిణాది నటి కళ్యాణి ప్రియదర్శన్ ఎంపికైనట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. కళ్యాణి ప్రియదర్శన్ ఇప్పటికే తెలుగు, తమిళం, మలయాళ భాషల్లో పలు విజయవంతమైన చిత్రాల్లో నటించి మంచి గుర్తింపు సంపాదించారు. సహజమైన నటన, అందంతో యువతలో ప్రత్యేకమైన ఫాలోయింగ్ ఏర్పరచుకున్న ఆమెకు ఇప్పుడు బాలీవుడ్‌లో భారీ అవకాశం దక్కబోతుందనే వార్త చర్చనీయాంశంగా మారింది. రణ్‌వీర్ సింగ్ వంటి స్టార్ హీరో సరసన నటించే అవకాశం రావడం ఆమె కెరీర్‌లో కీలక మలుపుగా భావిస్తున్నారు. రణ్‌వీర్ సింగ్ తన ఎనర్జిటిక్ స్క్రీన్ ప్రెజెన్స్, విభిన్న పాత్రలతో ప్రేక్షకులను అలరి స్తూ వస్తున్నారు. అలాంటి హీరోతో కళ్యాణి జోడీ కట్టడం సినిమాపై మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ ఇద్దరి మధ్య కెమిస్ట్రీ ఎలా ఉంటుందో తెలుసుకోవాలని అభిమానులు ఎదురుచూస్తున్నారు. ముఖ్యంగా దక్షిణాది ప్రేక్షకుల్లో కూడా ఈ కాంబినేషన్‌పై చర్చ మొదలైంది. 'ప్రళయ్' చిత్రాన్ని భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. యాక్షన్ సీక్వెన్సులతో పాటు భావోద్వేగాలకు కూడా ప్రాధాన్యత ఇచ్చే కథగా రూపొందుతోందని సినీ వర్గాలు చెబుతున్నాయి. అంతర్జాతీయ స్థాయి సాంకేతిక ప్రమాణాలతో సినిమాను రూపొందించేందుకు మేకర్స్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.





## విశ్వనాథం అండ్ సన్స్ నుంచి కొత్త లుక్ విడుదల

కోలీవుడ్ స్టార్ హీరో సూర్యకు తమిళంతో పాటు తెలుగులోనూ భారీ అభిమాన వర్గం ఉంది. ఇటీవల విడుదలైన 'వీరభద్రుడు' సినిమాతో మాస్ హిట్ అందుకున్న ఆయన, ఇప్పుడు మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నారు. టాలీవుడ్ దర్శకుడు వెంకీ అట్లూరి తెరకెక్కిస్తున్న 'విశ్వనాథ్ అండ్ సన్స్' సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. సూర్య పుట్టినరోజు సందర్భంగా చిత్రబృందం విడుదల చేసిన కొత్త పోస్టర్లు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ముఖ్యంగా బ్రౌన్ కలర్ సూట్‌లో సూర్య కనిపించిన స్టైలిష్ లుక్ అభిమానులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. చాలా కాలం తర్వాత సూర్యను ఇలాంటి క్లాస్, వింటేజ్ స్టైల్‌లో చూడటం ఫ్యాన్స్‌కు ప్రత్యేకమైన ఆనందాన్ని కలిగిస్తోంది. ఈ పోస్టర్లతో సినిమాపై మరింత హైప్ పెంచిన మేకర్స్ మరో సర్‌ప్రైజ్ కూడా ప్రకటించారు. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్‌కు మంచి స్పందన రావడంతో, ఈ కొత్త పాటపై కూడా అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం కుటుంబ భావోద్వేగాలతో పాటు కమర్షియల్ అంశాలను కలగలిపిన కథతో తెరకెక్కుతున్నట్లు తెలుస్తోంది. సూర్యను కొత్త కోణంలో చూపించే ఈ సినిమా ఆయన కెరీర్‌లో మరో ప్రత్యేక చిత్రంగా నిలుస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రస్తుతం సోషల్ మీడియాలో సూర్య బర్త్‌డే పోస్టర్లు ట్రెండింగ్‌లో ఉండగా, సాయంత్రం విడుదల కానున్న రెండో సాంగ్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



## బోల్డ్ సన్నివేశాల్లో నటించలేను : కాజల్

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ కాజల్ అగర్వాల్ మరోసారి తన వ్యక్తిగత అభిప్రాయాలను స్పష్టంగా వెల్లడించారు. సినిమాల్లో బికినీ, బోల్డ్ సన్నివేశాలు, రొమాంటిక్ సీన్స్‌పై ఇటీవల జరుగుతున్న చర్చల మధ్య ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ముఖ్యంగా పెళ్లి తర్వాత హీరోయిన్లు గ్లామర్ పాత్రలు చేయడంపై వస్తున్న విమర్శల నేపథ్యంలో కాజల్ స్పందించిన తీరు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ప్రస్తుతం 'ది ఇండియా స్టోరీ' సినిమా ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్న కాజల్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, కెరీర్ ప్రారంభం నుంచే తాను బికినీ లేదా అతిగా బోల్డ్ సన్నివేశాల్లో నటించడానికి ఆసక్తి చూపలేదని తెలిపారు. అలాంటి పాత్రలు చేయడం తనకు వ్యక్తిగతంగా అసౌకర్యంగా అనిపిస్తుందని, అందుకే ఎన్నో భారీ చిత్రాలను కూడా వదులుకున్నానని వెల్లడించారు. సినిమాల కోసం లేదా డబ్బు కోసం నా వ్యక్తిత్వాన్ని మార్చుకోలేను. నాకు కొన్ని విలువలు, సిద్ధాంతాలు ఉన్నాయి. వాటిని నేను ఎప్పుడూ రాజీ పడను. తెరపై బోల్డ్ సీన్స్ చేయాల్సిన అవసరం ఉందని నేను భావించను అని కాజల్ స్పష్టం చేశారు. తల్లి అయిన తర్వాత తన ఆలోచనల్లో మరింత మార్పు వచ్చిందని కూడా ఆమె తెలిపారు. తన కుమారుడు నీల్ కిచ్లూ పెద్దయ్యాక తన సినిమాలు చూసి గర్వపడాలని కోరుకుంటానని, తన నటించిన పాత్రల గురించి భవిష్యత్తులో తన బిడ్డకు వివరణ ఇవ్వాల్సిన పరిస్థితి రాకూడదనే ఉద్దేశంతో కథలు, పాత్రల ఎంపికలో మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తున్నట్లు చెప్పారు. నా కొడుకు నా సినిమాలు చూసి గర్వపడాలి. అతను అసౌకర్యంగా ఫీలయ్యే పాత్రలు నేను చేయాలనుకోవడం లేదు. అందుకే ఇప్పుడు ప్రతి కథను చాలా ఆలోచించి ఎంపిక చేసుకుంటున్నాను అని ఆమె పేర్కొన్నారు. ఇదిలా ఉంటే, ఇటీవల 'టాక్సిక్' సినిమాలో యశ్‌తో కలిసి నటించిన కియారా అద్వానీ రొమాంటిక్ సన్నివేశాలపై సోషల్ మీడియాలో ట్రోలింగ్ జరిగిన నేపథ్యంలో కాజల్ పాత వ్యాఖ్యలు మళ్లీ వైరల్ అవుతున్నాయి.

PUBLISHED AND OWNED BY DUSARI KASTURI, PRINTER B SANDHYA RANI PRINTED AT M/S.KAKATIYA PRINTERS 2-24-96/9, NEAR SRI KRISHNA PHARMA, LAXMINARAYANA NAGAR, IDA UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500039, PUBLISHED AT H.NO. 9-875/104/3A, BAPUJI COLONY, NEAR VIJAYA HOSPITAL NAGARAM , MEDCHAL MALKAJ-GIRI, TELANGANA - 500083..EDITOR : DUSARI RAVINDER GOUD, PRGI REGISTRATION NUMBER TGTEL/25/A1132, CELL :8522055889 MAIL ID:dusari kasturi9@gmail.com